

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు స్వీట్ తినిపిస్తున్న టీడీపీ నాయకులు



గూగుల్ రాక షురూ

విశాఖ సిగలో కలికితురాయి

ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం

ఉమ్మడి జిల్లాలో 480 ఎకరాలు కేటాయింపు

పెట్టుబడులు రూ.87,520 కోట్లు

ప్రత్యక్షంగా, పరోక్షంగా 1.88 లక్షల ఉద్యోగాలు



తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు ఆధ్వర్యంలో సంబరాలు



సత్యం జంక్షన్ వద్ద బాణసంచా కాలుస్తూ టీడీపీ శ్రేణుల సంబరాలు

- గూగుల్‌తో చేతులు కలిపిన అదానీ కనెక్స్
- అంబరాన్ని అంటిన సంబరాలు
- డేటా హబ్‌గా మారనున్న నగరం

విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): **విశాఖపట్నం చరిత్రలో '2025 అక్టోబరు 14' మైలురాయిగా నిలిచిపోనుంది. భారతదేశ చరిత్రలో కూడా ఇదో పెద్ద విశేషం. ఇప్పటివరకూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఈ స్థాయిలో ఏ రాష్ట్రానికీ రాలేదు. గూగుల్ సంస్థ విశాఖపట్నంలో రూ.87,520 కోట్లతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుకు మంగళవారం ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. దీని ద్వారా రాబోయే రోజుల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా 1.88 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెబుతున్నారు. మైక్రోసాఫ్ట్ రాకతో హైదరాబాద్ ఐటీలో ఎలా అభివృద్ధి సాధించిందో గూగుల్ డేటా సెంటర్‌తో విశాఖ అలా వెలుగులీనుతుంది.**

గూగుల్ డేటా సెంటర్ వల్ల 12 దేశాలతో విశాఖ నగరానికి సంబంధాలు కలుస్తాయి. ఏఐ, డేటా అనలిటిక్స్‌లో నిపుణులు తయారవుతారు. అనుబంధ సంస్థలు ఏర్పాటవుతాయి. ఐటీ ఎకో సిస్టమ్ పెరుగుతుంది. ఇది విశాఖను అంతర్జాతీయ స్థాయిలో నిలుపుతుంది. నగరం డేటా హబ్‌గా మారుతుంది.

480 ఎకరాలు కేటాయింపు

గూగుల్ డేటా సెంటర్‌కు ముందు ఆనందపురం మండలం తర్లువాడలో 200 ఎకరాలు ఇవ్వాలని అనుకున్నారు. కానీ వారి ప్రణాళికలు భారీగా ఉండడంతో అందుకు తగిన భూములు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తర్లువాడలో 200 ఎకరాలతో పాటు అడవివరంలో సింహాచలం దేవస్థానానికి చెందిన 120 ఎకరాలు, అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో మరో 160 ఎకరాలు ఇస్తామని ఒప్పందం చేసింది. ఇవి కాకుండా సింగపూర్ నుంచి సముద్ర అంతర్భాగం నుంచి తీసుకువచ్చే సబ్‌మెరైన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ కోసం తీర ప్రాంతంలో మరో 15 ఎకరాలు కేటాయించడానికి హామీ ఇచ్చింది. డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్‌ను అందించడానికి అదానీ సంస్థ గూగుల్‌తో చేతులు కలిపింది. అదానీ యాజమాన్యం మధురవాడలో తీసుకున్న 130 ఎకరాల్లో డేటా సెంటర్ చేయాల్సి ఉంది. దాని కోసం అదానీ కనెక్స్‌తో జాయింట్ వెంచర్ చేసింది. ఇప్పుడు ఆ సంస్థ విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్లు, క్లీన్ ఎనర్జీ, ఎనర్జీ స్టోరేజీకి అవసరమైన సహకారం గూగుల్‌కు అందించనుంది. ఈ డేటా సెంటర్‌కు అవసరమైన నీటిని ఇరవై ఏళ్ల పాటు అందించడానికి ప్రభుత్వం హామీ ఇచ్చింది. పదేళ్లపాటు నీటి చార్జీలకు 25 శాతం రాయితీ ప్రకటించింది. విద్యుత్ సమకూర్చుకోవడానికి గూగుల్ పెట్టే వ్యయం ప్రభుత్వమే భరిస్తుంది. ఈ మొత్తం గరిష్ఠంగా రూ.500 కోట్ల వరకు ఉంటుందని అంచనా. రెన్యువబుల్ ఎనర్జీ ప్రస్తుతం మార్కెట్‌లో యూనిట్ రెండు రూపాయలకే దొరుకుతుండగా, అందులో యూనిట్‌కు రూపాయి రాయితీ ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించింది. ఇలా 15 ఏళ్ల

... మిగతా 6వ పేజీలో

గూగుల్‌తో ఊహించని అభివృద్ధి

- నగరం రూపురేఖలు మారిపోతాయి
- యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు
- కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గూగుల్ డేటా సెంటర్ రాకతో విశాఖపట్నం ఊహించని విధంగా అభివృద్ధి చెందుతుందని, నగరం రూపురేఖలు మారిపోతాయని కలెక్టర్ హరేంధిరప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ డేటా సెంటర్ ఆసియాలోనే అతి పెద్దదని, సుమారు రూ.85 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని, యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నామని, విశాఖ నుంచి భోగాపురం కొత్త విమానాశ్రయానికి 50 నిమిషాల్లో చేరుకోవచ్చునన్నారు. ఇందులో భాగంగా 15 మాస్టర్ ప్లాన్ రహదారులు వేస్తున్నామన్నారు. వాటిలో ఏడింటికి టెండర్లు కూడా పిలిచామన్నారు. 2026 మే నాటికి రహదారుల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. పోలవరం ఎడమ కాలువ నుంచి అవసరమైన నీటిని తెచ్చేందుకు ప్రణాళికలు ఉన్నాయన్నారు.

నగరంలో నవ రత్నం

హిందుస్థాన్ షిప్‌యార్డుకు మినీ నవరత్న హోదా

- కష్టాల కడలి నుంచి సమున్నత స్థాయికి
- వందలాది నౌకా నిర్మాణాలు చేపట్టిన సంస్థ
- మరమ్మతుల్లో ముఖ్యభూమిక పోషించిన వైనం



మల్కాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): **నౌకా నిర్మాణంతో విజయవంతంగా ఆరంభమైన ప్రయాణం కడలి కెరటంలా పడినా మళ్లీ ఉవ్వెత్తున ఎగసింది. నౌకలు, సబ్‌మెరైన్ల నిర్మాణం, మరమ్మతుల్లో సరికొత్త రికార్డును సృష్టించి అంతర్జాతీయ స్థాయిలో త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించింది. తాజాగా మినీ నవరత్న హోదాను సొంతం చేసుకుని సగర్వంగా నిలబడింది హిందుస్థాన్ షిప్‌యార్డు.**

కేవలం మత్స్యసంపదకే పరిమితమైన విశాఖ సముద్ర తీరంలో గుజరాత్ రాష్ట్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వాల్‌చంద్ హీరాచంద్ సింధియా స్టీమ్ నావిగేషన్ కంపెనీ పేరుతో 1941 జూన్ 21న నౌకా నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తొలి నౌక జల ఉషను విజయవంతంగా జలప్రవేశం చేశారు. ఆ తరువాత 1957లో సింధియా స్టీమ్ నావిగేషన్ కంపెనీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్‌గా రూపాంతరం చెందింది. అనంతరం వాణిజ్య నౌకలతో పాటు ప్రయాణికుల నౌకలు, టగ్‌లు, ఆయిల్ నౌకలు, సబ్‌మెరైన్లు, యుద్ధనౌకలను నిర్మించి, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించింది. వివిధ కారణాలతో 1980 దశకంలో నష్టాల బారినపడిన షిప్‌యార్డు, పడిలేచిన కెరటంలా విజృంభించింది. డ్రైడాక్ విభాగం నిర్మాణంతో అనేక నౌకలకు మరమ్మతులు చేపట్టడం ద్వారా లాభాల బాట పట్టింది.

నౌకా నిర్మాణంలో కీలకం

తూర్పు నౌకాదళం పక్కనే ఉన్న హిందుస్థాన్ షిప్ యార్డును కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ 2010లో రక్షణ రంగంలో విలీనం చేసింది. ఆ తరువాత ప్రధానంగా రక్షణ రంగానికి చెందిన అనేక భారీనౌకలు, సబ్‌మెరైన్‌లు, సింధుకీర్తి వంటి యుద్ధ నౌకలను నిర్మించి, నౌకా నిర్మాణ రంగంలో సమున్నత స్థాయికి చేరింది. ఈ ప్రక్రియలో భాగంగా అనేక అవార్డులను సొంతం చేసుకుంది. తాజాగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రీన్‌షిప్‌లను రూపొందించే దిశగా శరవేగంగా దూసుకుపోతోంది. ప్రతి ఆర్థిక సంవత్సరంలోనూ లాభాలను చవిచూస్తూ తాజాగా మినీ నవరత్న హోదాను దక్కించుకుంది. ఈ హోదా రావడం పట్ల షిప్‌యార్డు ఉద్యోగ సంఘాలు, అధికార సంఘాలు, కాంట్రాక్టర్లు సంబరాలు చేసుకుంటున్నారు.

రేపటి నుంచి షాపింగ్ ఫెస్టివల్

- జీఎస్టీ 2.0పై అవగాహన, ఆయా వస్తువులను తగ్గింపు ధరలను అందించేందుకు ఏర్పాటు
- ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించి, ధరలు ఎంత మేరకు తగ్గాయో వివరించడానికి, ఆయా వస్తువులను తగ్గింపు రేట్లపై అందించడానికి షాపింగ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు ఈ ఫెస్టివల్ ఉంటుందన్నారు. వ్యాపార సంస్థలు, డ్వాక్రా సంఘాలతో కలిసి సుమారు 60 స్టాళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు లావాదేవీలు ఉంటాయని, అవగాహనకు శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఇతర అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అదనపు కమిషనర్ ఎస్.శేఖర్, అసిస్టెంట్ కమిషనర్ రాంబాబు, డీటీఓ మాధవి, హోటల్స్ అండ్ టూరిజం అసోసియేషన్ ప్రతినిధి పవన్ కార్తీక్ పాల్గొన్నారు.

షరా మామూలే

రహదారుల పక్కన యథావిధిగా దుకాణాలు

- రెండు వారాల కిందట ఆక్రమణల తొలగింపు
- మళ్లీ ఏర్పాటు
- భారీగా దసరా మామూళ్లు దండుకున్న సిబ్బంది
- టౌన్ ప్లానింగ్ విభాగం మొద్దు నిద్ర
- చిత్తశుద్ధి లేని అధికారులు, కలిసిరాని ప్రజా ప్రతినిధులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రోడ్డు మార్జిన్ల ఆక్రమణలపై మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) వెనక్కి తగ్గింది. ప్రత్యామ్నాయం చూపకుండా వేలాది మందిని నడిరోడ్డుపై నిలబెట్టారని విమర్శలు రావడమే అందుకు కారణమని ప్రచారం జరుగుతోంది. తొలగించిన దుకాణాల్లో దాదాపు సగం అదే స్థానంలో తిరిగి కొనసాగుతున్నాయి. వారి నుంచి జీవీఎంసీ సిబ్బంది రోజువారీ వసూళ్లతో పాటు దసరా సమయంలో మామూళ్లు కూడా భారీగానే దండుకున్నారు.



సీతమ్మధార రైతుబజార్ వద్ద..



ఎంవీపీ కాలనీ ఆల్వార్ దాస్ గ్రౌండ్ వద్ద రోడ్డుపై కొనసాగుతున్న దుకాణాలు

విశాఖపట్నంలో నవంబరు నెలలో పెట్టుబడిదారుల సదస్సు జరగనుంది. దీనికి జాతీయ స్థాయిలో వ్యాపారవేత్తలు హాజరు కానున్నారు. ఆ సమయానికి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకోగా, దాంతో పాటు ట్రాఫిక్ సమస్యలు లేకుండా రహదారుల పక్కన ఆక్రమణలను తొలగించాలని కొందరు ప్రజా ప్రతినిధులు సూచించారు. ప్రధాన రహదారులతో పాటు వీధుల్లో కూడా రోడ్ల పక్కన దుకాణాల సంఖ్య పెరిగిపోయిందని, వాటన్నింటినీ తొలగించాలని ఆదేశించారు. పలువురు ఎమ్మెల్యేలు దీనిని వ్యతిరేకించినా అధికారులు ముందుకు వెళ్లారు. జేసీబీలు, పోలీసులు, సిబ్బందితో వెళ్లి దుకాణల తొలగింపు ప్రారంభించారు. ఏ ఒక్కరికీ ముందస్తు సమాచారం ఇవ్వలేదు. దాంతో కట్టుబట్టలతో చిల్లర వర్తకులు రోడ్డున పడ్డారు. జీవనాధారం పోవడం, పెట్టుబడుల నష్టం జరగడంతో అత్యధికులు అధికారుల చర్యలను తప్పుబట్టారు. ఇవీమే పట్టించుకోకుండా అధికారులు దాదాపు రెండు వారాలు ఈ తొలగింపుల కార్యక్రమం కొనసాగించారు. సుమారు 40 వేలకు పైగా దుకాణాలను తొలగించారు.

దసరా పేరుతో విరామం

దసరా పండుగ వస్తున్న నేపథ్యంలో తొలగింపునకు విరామం ఇస్తున్నామని, పండుగ ముగిసిన తరువాత మిగిలిన ప్రాంతాల్లో దుకాణాలు తొలగిస్తామని జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రకటించారు. అయితే దసరా వెళ్లిన తరువాత ఆ పనులు ముందుకు

... మిగతా 6వ పేజీలో

33,812 మందికి బీపీ

- 21,786 మందికి షుగర్
- క్యాన్సర్ బాధితులు 225 మంది...
- జిల్లాలో ముగిసిన ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్) 3.0 సర్వే
- 4.0 ప్రారంభం
- క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తించడమే లక్ష్యం



విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసంక్రమిత వ్యాధుల (అంటువ్యాధులు కానివి)తో బాధపడుతున్న వారిని గుర్తించేందుకు నిర్వహించిన ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్) 3.0 సర్వే ముగిసింది. గడిచిన ఏడాది నవంబరు నుంచి ఈ ఏడాది సెప్టెంబరు నెలాఖరు వరకు నిర్వహించిన ఈ సర్వేలో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులను గుర్తించారు.

ఎన్‌సీడీ 3.0లో భాగంగా జిల్లాలో 18,32,792 మందిని పరీక్షించాల్సి ఉంది. అయితే 15,25,932 (83.26 శాతం) మందిని పరీక్షించారు. మరో 16.74 మందిని స్క్రీనింగ్ చేయాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈ నెల నుంచి ఎన్‌సీడీ 4.0 సర్వేను జిల్లాలో అధికారులు ప్రారంభించారు. ఎన్‌సీడీ 3.0 సర్వే ప్రకారం జిల్లాలో 15 లక్షల మందికిపైగా ప్రజలను పరీక్షించగా, 62,180 మందికి హైపర్ టెన్షన్ (బీపీ) ఉన్నట్టు ప్రాథమిక పరీక్షల్లో గుర్తించారు. తదుపరి నిర్వహించిన పరీక్షల్లో 33,812 మంది బీపీతో బాధపడుతున్నట్టు తేలింది. అలాగే 21,786 మంది షుగర్‌తో బాధపడుతున్నట్టు తేలింది. ఇంకా 3,201 మందికి నోటి క్యాన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్నట్టు గుర్తించి పరీక్షలు నిర్వహించగా 73 మందికి వ్యాధి ఉన్నట్టు తేలింది. అలాగే, రొమ్ము క్యాన్సర్ అనుమానిత కేసులు 1,969 గుర్తించగా, వారికి పరీక్షలు నిర్వహించగా 112 మందికి నిర్ధారణ అయ్యింది. అలాగే, సర్వైకల్ క్యాన్సర్ అనుమానిత లక్షణాలున్న 1,948 మందికి ఆరోగ్య శాఖ సిబ్బంది పరీక్షలు నిర్వహించగా 40 మందికి నిర్ధారణ అయింది. వారికి మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కేజీహెచ్‌కు రిఫర్ చేశారు.

4.0 సర్వే ప్రారంభం..

జిల్లాలో ఎన్‌సీడీ 4.0 సర్వే ప్రారంభమైంది. ఈ సర్వే ప్రధానంగా క్యాన్సర్ కేసులను గుర్తించడమే లక్ష్యంగా సాగనుంది. 3.0 సర్వేలో

... మిగతా 6వ పేజీలో

చెత్త తరలింపులో అక్రమాలు

- నిర్ధారించిన జీవీఎంసీ అధికారులు
- చేసిన పనికి మించి డీజిల్ డ్రా చేసినట్టు గుర్తింపు
- కాంట్రాక్టర్ నుంచి రికవరీకి చర్యలు



'ఆంధ్రజ్యోతి'లో అక్టోబరు 1వ తేదీన ప్రచురితమైన కథనం

విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): **జోన్‌ల నుంచి కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు చెత్త తరలింపులో అక్రమాలు చోటు చేసుకున్న విషయం వాస్తవమేనని జీవీఎంసీ అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు సంబంధిత కాంట్రాక్టర్ల నుంచి రికవరీకి చర్యలు ప్రారంభించారు.**

జోన్-4 పరిధిలోని టౌన్‌కొత్తరోడ్డు, జోన్-6 పరిధిలోని గాజువాక, జోన్-7 పరిధిలోని చీమలాపల్లిలో ఏర్పాటుచేసిన క్లోజ్డ్ కాంపాక్టర్ సిస్టమ్ (సీసీఎస్) ప్రాజెక్టు నుంచి చెత్తను హుక్ లోడర్ల ద్వారా కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు తరలించాల్సి ఉంది. అయితే రాత్రి వేళ ఓపెన్ టిప్పర్లతో తరలిస్తున్నారని, హుక్ లోడర్లు మరమ్మతులో ఉన్నప్పటికీ వాటి పేరిట జీవీఎంసీ నుంచి ప్రతి నెలా డీజిల్ తీసుకుంటున్నారని 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే. దీనిపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ స్పందించి మెకానికల్ విభాగం అధికారులను విచారణకు ఆదేశించారు. అధికారులు ఆయా జోన్లలోని సీసీఎస్ ప్రాజెక్టుల నుంచి కాపులుప్పాడలోని జిందాల్ ప్లాంటుకు తరలింపు, జీవీఎంసీ నుంచి ఎంత డీజిల్‌ను తీసుకున్నారనే దానిపై లోతుగా విచారణ జరిపారు. గాజువాకలో ఒక హుక్ లోడర్ రోడ్డు ప్రమాదం కారణంగా గ్యారేజీలో ఉన్నప్పటికీ దాని పేరిట సుమారు రూ.21 లక్షల వరకు డీజిల్‌ను తీసుకున్నట్టు గుర్తించారని తెలిసింది. అలాగే జిందాల్ ప్లాంటు ప్రతినిధులు ఇచ్చిన ట్రిప్ షీట్‌లకు, బిల్లు కోసం కాంట్రాక్టరు అధికారులకు అందజేసిన ట్రిప్ షీట్‌లకు భారీ తేడా (సుమారు 700 ట్రిప్పులు) ఉన్నట్టు గుర్తించినట్టు తెలిసింది. అదనపు ట్రిప్పులు పేరుతో డ్రా చేసిన డీజిల్‌ను కూడా చీమలాపల్లి, గాజువాక, టౌన్‌కొత్తరోడ్డు సీసీఎస్ ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలను చూస్తున్న

... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

- సరఫరాకు అంతరాయం లేకుండా ఏర్పాట్లు
- డివిజన్‌లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధనకు విద్యుత్ ఉద్యోగులు 15వతేదీ(బుధవారం) నుంచి దశల వారీగా ఆందోళనలు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరాకు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు విశాఖ సర్కిల్ ఎస్ఈ జి.శ్యాంబాబు బుధవారం విలేకరులకు తెలిపారు. జోన్-1, జోన్-2,జోన్-3 డివిజన్ల పరిధిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా సమర్థంగా ఎదుర్కొనాలని సీఎండీ పృథ్వీతేజ్ ఆదేశించడంతో సిబ్బందితో పూర్తి సన్నద్ధతతో ఉన్నామన్నారు. సర్కిల్ కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాలు 24/7 పనిచేస్తాయన్నారు. సరఫరా సమస్యలు ఎదురైతే 1912కు గాని, జోన్-1 9490610019, జోన్-2 9490610020, జోన్-3 9491030722 నంబర్లకు ఫిర్యాదు చేయాలని కోరారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేత

భీమునిపట్నం (రూరల్) అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండలం తాటితూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న క్రీడాకారులైన 11 మంది విద్యార్థులకు గ్రామ సర్పంచ్ ఎస్. సంతోషికుమారి మంగళవారం క్రీడాదుస్తులు (జర్సీలు) అందజేశారు. ఇటీవల రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొని బహుమతులు పొందిన విద్యార్థులను ఎంపిక చేసి క్రీడా దుస్తులను అందించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ సోమేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సహాయం

భీమునిపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ మార్గాన వీరవెంకటమోహనరావుకు రెండు కిడ్నీలు పాడయ్యాయి. తీవ్రఅనారోగ్యంతో బాధపడుతున్న అతడికి కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఛైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి.. బాధితుడు మోహనరావుకు రూ. 10వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.

త్వరలో ప్రధాన రహదారుల విస్తరణ

- భీమిలి ఎమ్మెల్యే గంటా
- 3వ వార్డులో రూ.80.95 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా, పాల్గొన్న కార్పొరేటర్లు, కూటమి నేతలు, అధికారులు

భీమునిపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : భీమిలి టౌన్‌లో ప్రధాన రహదారుల విస్తరణ పనులు త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. మంగళవారం ఆయన జీవీఎంసీ 3వ వార్డులో రూ.80.95 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ రహదారుల విస్తరణ కోసం ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. నియోజకవర్గంలో చేరినజీవీఎంసీ వార్డుల్లో రూ.వంద కోట్లతో మౌలిక సదుపాయాలకు పనులు జరుగుతున్నాయన్నారు. అందువల్ల వార్డులో జరుగుతున్న కల్వర్టు, సీసీ రహదారులు, కాలువల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

అనంతరం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు వద్దనే మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద 13 మంది మత్స్యకార లబ్ధిదారులకు రాయితీపై ఔట్ బోట్ ఇంజన్లను ఎమ్మెల్యే గంటా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఒక్కో బోట్ ఇంజన్ ధర రూ.83,300 లు కాగా, 40 శాతం రాయితీ లభిస్తుందని మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు తెలిపారు. అనంతరం చిప్పాడ దివీస్ సంస్థ రూ.5.5 లక్షలతో అందించిన సముద్రంలో నాచు పెంపకానికి వినియోగపడే సామగ్రిని భీమిలి ఎగువపేట మత్స్యకార సొసైటీకి అందజేశారు. మంగమారిపేట తీరంలో అనువైన ప్రదేశంగా గుర్తించిన ప్రాంతంలో ఈ సముద్రపు నాచును పెంపకం చేపట్టనున్నట్టు లక్ష్మణరావు తెలిపారు.

కార్యక్రమంలో జీవీఎంసీ కార్పొరేటర్లు గాడు చిన్నికుమారిలక్ష్మి, లొడగల అప్పారావు, పీవీ నరసింహం, జడ్పీటీసీ గాడు వెంకటప్పడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, కూటమి నాయకులు చిక్కాల విజయ్‌బాబు, గాడు అప్పలనాయుడు, గొలగాని నరేంద్రకుమార్, పాసి త్రినాథ్‌కుమార్, శాఖరి శ్రీనివాస్, కోరాడ రమణ, తాట్రాజు అప్పారావు, సరగడ అప్పారావు, గరికిన కింగ్, మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, బమ్మిడి తారక్, గరే సదానంద, దండి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంటులో ప్రమాదం...కన్వేయర్ బెల్ట్ దగ్ధం

విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో మంగళవారం ఉదయం మరో ప్రమాదం చోటుచేసుకుంది. రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు నుంచి థర్మల్ పవర్ ప్లాంటుకు బొగ్గును తరలించే సీసీ-31 కన్వేయర్ బెల్ట్ సెల్ఫ్ ఇగ్నిషన్ సమస్య వల్ల 62 మీటర్ల మేర కాలిపోయింది. దాంతో పాటు కిందనున్న కన్వేయర్ బెల్ట్ 150 మీటర్ల పొడవున పాడైంది. ఈ నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం లేకుండా వేరే కన్వేయర్ల ద్వారా బొగ్గును థర్మల్ పవర్ ప్లాంటుకు తరలించారు. అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేశారు. దీనివల్ల ఆర్థికంగా పెద్ద నష్టం వాటిల్లలేదని ప్లాంటు వర్గాలు తెలిపాయి.

సచివాలయంలో సిబ్బంది కొరతతో సక్రమంగా అందని పౌర సేవలు

- సమస్య పరిష్కారం కోరుతూ గ్రామస్థుల వినతి

భీమునిపట్నం (రూరల్) అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి) : భీమిలి రూరల్ మండలం మజ్జివలస గ్రామ సచివాలయంలో సిబ్బంది అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత కొంతకాలంగా ఈ గ్రామ కార్యదర్శి పోస్టు ఖాళీగా ఉంది. తాళ్లవలస పంచాయతీ కార్యదర్శిని ఇన్‌చార్జిగా నియమించారు. రెండు పంచాయతీలు బాధ్యత పెరిగిపోవడంతో ఆయన ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి ఉందని స్థానికులు అంటున్నారు.

ఈ సచివాలయంలో వీఆర్వో పోస్టు ఉన్నప్పటికీ చిట్టివలస బాలాజీనగర్ సచివాలయాలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అందువల్ల గ్రామ స్థాయిలో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని అంటున్నారు. పంచాయతీలో వివిధ నిర్మాణాలను పరిశీలించవలసిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ మెటర్నటీ లీవులో ఉండటం వల్ల ఈ బాధ్యతల్ని కూడా ఎవరూ చూడడం లేదు. మొత్తం ఎనిమిది మంది సిబ్బందిలో విలేజీ పోలీసు, డిజిటల్ అసిస్టెంట్ వ్యవసాయ, ఉద్యానవన శాఖ సిబ్బంది మాత్రం ఉన్నారు. గత మూడు నెలల నుంచి ఇదే పరిస్థితి ఉండటంతో ఈ పంచాయతీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తమ పంచాయతీకి పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని గ్రామస్థులు జిల్లా అధికారులకు మంగళవారం వినతిపత్రాన్ని అందించారు.

పార్కుల్లో పశువుల సంచారంతో ఇబ్బందులు

భీమునిపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పర్యాటక కేంద్రంగా పేరొందిన బీచ్‌లో పశువుల సంచారం ఎక్కువైంది. జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం వల్ల పార్కుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రాత్రి పగలూ తేడా లేకుండా పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నారు. గత వారం బీచ్‌పార్కులో పశువులు సంచరించి పచ్చదనాన్ని పాడుచేశాయి. తాజాగా లైట్‌హౌస్ పక్కనున్న గాంధీజీ పార్క్‌లో సోమవారం రాత్రి పశువులు కనిపించాయి. సందర్శకులు పార్కులో సిమెంట్ కాంక్రీట్ బెంచీలు,చ ప్రహరీ గోడపై కూర్చొని ఆహ్లాదంగా గడపడానికి అక్కడే సంచరిస్తున్న పశువుల వల్ల ఇబ్బంది పడుతున్నారు. పార్కులు సందర్శకుల కోసం ఏర్పాటు చేశారా? పశువుల మేత కోసమా? అని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పార్కుల నిర్వహణపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

మహిళా క్రీడాకారులను ప్రోత్సహమే ప్రభుత్వ ధ్యేయం

- ఖేల్ ఇండియా అస్మిత ఉమెన్స్ రగ్బీ పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గంటా



క్రీడల ప్రారంభోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహిళా క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ప్రధానోద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అస్మిత పేరుతో దేశంలోని పలు ప్రాంతాల్లో లీగ్ పోటీలను నిర్వహిస్తోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని మినీ స్టేడియంలో భీమిలి, వైజాగ్‌లో ఉమెన్ కేటగిరీలో ఖేల్ ఇండియా అస్మిత ఉమెన్స్ రగ్బీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ రగ్బీ పోటీలు ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, నేషనల్, యూనివర్శిటీ, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ వారు కూడా నిర్వహిస్తున్నారన్నారు. మహిళా క్రీడాకారులు ఈ పోటీలను సద్వినియోగపర్చుకుని క్రీడారంగంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మూడు శాతం స్పోర్ట్సు కోటాలో రగ్బీ క్రీడాంశానికి అవకాశం ఇచ్చిందన్నారు. అనంతరం నిర్వహించిన రగ్బీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. కార్యక్రమంలో జీవీఎంసీ 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు హర్షవర్ధన్, రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు లలిత్‌కుమార్, కార్యదర్శి కిషోర్, జిల్లా ఉపాధ్యక్షులు నల్ల శ్రీనివాస్, టీడీపీ నాయకులు గాడు అప్పలనాయుడు, గొలగాని నరేంద్రకుమార్, కశిరెడ్డి దామోదరరావు, కాకర వెంకటరమణ, మండల తహసీల్దార్ కార్యాలయం హెచ్‌డీటీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ వెల్ఫేర్ కాలేజ్ బాలుర హాస్టల్‌కు గ్యాస్ స్టౌ వితరణ

భీమునిపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మదురవాడలోని సోషల్ వెల్ఫేర్ కాలేజ్ బాలుర హాస్టల్‌కు కమర్షియల్ గ్యాస్ స్టౌను భీమిలికి చెందిన సుందరమ్మ రామన్న చెట్టి వెల్ఫేర్ ట్రస్ట్ ఛైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ చెట్టి అశోక్ చక్రవర్తి అందజేశారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిలుపుతో స్టౌను హాస్టల్ వార్డెన్ ఆర్.ప్రసాదరావుకు అందజేసినట్టు ఆయన తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- జడ్పీ సీఈవో నారాయణమూర్తి


కొవ్వాడలో పంచాయతీ సిబ్బందికి సూచనలిస్తున్న జడ్పీ సీఈవో

పద్మనాభం-రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యం నిర్మూలన, పరిసరాల పరిశుభ్రతపై పంచాయతీ అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణమూర్తి ఆదేశించారు. మంగళవారం ఉదయం కొత్త కొవ్వాడ గ్రామాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి చెత్త సేకరణ, తడి-పొడి చెత్త వేరు చేయడం, చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణ, ప్రధాన వీధుల్లో పరిసరాల పరిశుభ్రతతో పాటు వాటర్ ట్యాంక్ క్లోరినేషను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో నారాయణమూర్తి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తగత పరిశుభ్రతపై సచివాలయ సిబ్బంది ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డివిజినల్ అధికారి నిర్మాలాదేవి, ఎంపీడీవో కె.రూపేష్, ఈవోపీఆర్డీ కనకల రమేష్‌నాయుడు, గ్రామ పంచాయతీ అధికారులు. సచివాలయ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

అనంతుడి పవిత్రోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

పద్మనాభం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 16 నుంచి 19 వరకు అనంతుని క్షేత్రంలో నిర్వహించే పవిత్రోత్సవాల కరపత్రాలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం ఎంవీపీలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. పురాతన ఈ క్షేత్రంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఇప్పటికే ఘాట్‌రోడ్డును ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావడంతో భక్తులు స్వామి దర్శనానికి సులభంగా వెళ్లగలుగుతున్నారన్నారు.

ఈ సందర్భంగా ఆలయ ఈవో ఎమ్మెల్యేను ఉత్సవాలకు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పీఎల్ఎన్ రాజు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కోరాడ రమణ, విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

33,812 మందికి బీపీ

... 5వ పేజీ తరువాయి

క్యాన్సర్ కేసులు గుర్తింపు ఆశించిన స్థాయిలో జరగలేదని ప్రభుత్వం భావిస్తోంది. సుమారు ఏడాదిపాటు అత్యంత పకడ్బందీగా సర్వే నిర్వహించాలని సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీచేశారు. పట్టణాల్లో ఆశ కార్యకర్త, ఏఎన్ఎం, గ్రామీణ ప్రాంతాల్లో ఆశ కార్యకర్త, ఎంఎల్‌హెచ్‌పీ ఇంటింటికీ వెళ్లి స్క్రీనింగ్ చేయనున్నారు. గత కొన్నాళ్లుగా క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో 4.0 సర్వే పూర్తిగా దానిపైనే సాగుతుందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించేలా సర్వే జరగనుందన్నారు.

చెత్త తరలింపులో అక్రమాలు

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టర్ నుంచి రికవరీకి ప్రతిపాదనలు తయారుచేస్తున్నట్టు సమాచారం.

ఇదిలావుండగా సీసీఎస్ ప్రాజెక్టుల నిర్వహణ చూసే కాంట్రాక్టర్లకు మెకానికల్ విభాగంలోని ఒక అధికారి కొమ్ముకాస్తున్నారని, వారికి అనుకూలంగా బిల్లు చెల్లించేలా ఫైల్ పెట్టాలని ఒత్తిడి చేస్తున్నట్టు ఆ విభాగం సిబ్బంది చెబుతున్నారు. కాంట్రాక్టర్లు పైస్థాయిలో పలుకుబడి ఉన్నవారని, తర్వాత ఇబ్బంది పడాల్సి ఉంటుందని తమను బెదిరిస్తున్నట్టు పేర్కొంటున్నారు. ఇటీవల టౌన్‌కొత్తరోడ్డులోని సీసీఎస్ ప్రాజెక్టు కాంట్రాక్టర్‌కు టెర్మినేషన్ నోటీసు ఇవ్వాలని కమిషనర్ కేతన్‌గార్గ్ స్వయంగా ఆదేశించారు. ఆ మేరకు మెకానికల్ విభాగం అధికారులు జారీచేసిన నోటీసుపై ఏఈ, డీఈలు సంతకం చేసినా కాంట్రాక్టర్‌కు అనుకూలంగా ఉన్న అధికారి మాత్రం సంతకం చేయలేదని చెబుతున్నారు. ఏదిఏమైనా 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వరుస కథనాలతో సీసీఎస్ ప్రాజెక్టుల నిర్వహణలో అవినీతికి అడ్డుకట్టపడిందని మెకానికల్ విభాగం సిబ్బంది హర్షం వ్యక్తంచేస్తున్నారు.


కొండవాలు ప్రాంతాలను పరిశీలిస్తున్న జడ్పీ కనకమహాలక్ష్మి, కార్పొరేటర్ హేమలత

కొండవాలు ప్రాంతాల్లో జడ్సీ, కార్పొరేటర్ పర్యటన

కొమ్మాది, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కొండవాలు ప్రాంతాల నుంచి కొండచరియలు విరిగిపడి నివాసాలపై పడుతున్నాయని, అందువల్ల ఆయా ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మించాలని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత జోన్-2 కమిషనర్ కె.కనకమహాలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లారు. వర్షాలకు శారదానగర్, అయ్యప్పనగర్ కాలనీల్లో కొండచరియలు విరిగిపడుతున్నాయని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తేవడంతో ఆమె జడ్సీకి పరిస్థితిని వివరించారు. ఈ మేరకు మంగళవారం జడ్సీ, కార్పొరేటర్, డీఈ మణికుమార్‌లు పలువురు అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో కొండవాలు ప్రాంతా లను పరిశీలించారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణానికి ప్రణాళికలను రూపొందించాలని అధికారులను జడ్సీ ఆదేశించారు.

'కోటి సంతకాల సేకరణను విజయవంతం చేయాలి'

పద్మనాభం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తున్న వ్యవహారంపై వైసీపీ చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు కోరారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు వైద్యాన్ని మరింత చేరువ చేసి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందించడానికి 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వాటిని తమ అనుయాయుల కోసం ప్రైవేటుపరం చేసేందుకు చూస్తుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంపీపీ కె.రాంబాబు, జెడ్పీ వైస్ ఛైర్మన్ ఎస్.గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

సాగర్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సాగర్‌నగర్ సాగరేశ్వరాలయ సముదాయంలో గల ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

'కొవ్వాడ' లబ్ధిదారుల జాబితా సిద్ధం కాలేదు

- ప్రస్తుతం అభ్యంతరాలను స్వీకరిస్తున్నాం
- రైతులు ఎలాంటి అపోహలకు గురి కావొద్దు
- తహశీల్దార్ కె.ఆనందరావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పద్మనాభం తహశీల్దార్ ఆనందరావు

పద్మనాభం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కొవ్వాడ భూ సమీకరణలో లబ్ధిదారుల తుది జాబితా ఇంకా ఖరారు కాలేదని పద్మనాభం తహశీల్దార్ కె.ఆనందరావు పేర్కొన్నారు. మంగళవారం తమ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొవ్వాడ భూ సమీకరణలో అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణలు అవాస్తవాలన్నారు. ఈ తుది జాబితా రూపొందించడానికి ఇంకా సమయం ఉందని, ప్రస్తుతం అభ్యంతరాలను స్వీకరిస్తున్నామన్నారు. అందువల్ల రైతులు ఎటువంటి అపోహలకు గురికావద్దని కోరారు. ఈ సమీకరణ కోసం నోటిఫికేషన్ ఇచ్చినప్పటి నుంచి అనుభవదారుల గుర్తింపునకు సర్వే చేశామన్నారు. వీఆర్వోల ద్వారా గుర్తించిన 253 మంది అనుభవదారుల జాబితాను ఇప్పటికే అన్ని కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో పెట్టామని, ఈ జాబితాపై అభ్యంతరాలను స్వీకరించడానికి 60 రోజుల గడువు ఇచ్చామన్నారు. నవంబరు 25 వరకు రైతులు తమ అభ్యంతరాలను సచివాలయంలో గానీ తమ కార్యాలయంలో కానీ ఇవ్వవచ్చన్నారు.

ఇప్పటివరకు తమ పేర్లలో తప్పులు దొర్లాయని 88 మంది అభ్యంతరాలను వ్యక్తం చేశారని, వీటిపై నవంబరు 27 లేదా, 28 తేదీల్లో తమ కార్యాలయంలో భీమిలి ఆర్డీవో దర్యాప్తు చేస్తారని తహశీల్దార్ తెలిపారు. ఈ భూ వ్యవహారాల్లో తాను తుది నిర్ణయం తీసుకోనని, ఆర్డీవో, జాయింట్ కలక్టర్, తదితరులకు కూడా లబ్ధిదారులు తమ అభ్యంతరాలను చెప్పుకునే అవకాశం ఉందన్నారు.

ప్రతి సచివాలయ పరిధిలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదుదారుల నుంచి వినతులను స్వీకరించి వారికి రశీదులు ఇవ్వాలని వీఆర్వోలను ఆదేశించామని తహశీల్దార్ కె.ఆనందరావు తెలిపారు. ఇలా చేయడం వల్ల మండల స్థాయికి వచ్చే ఫిర్యాదులు తగ్గుతాయన్నారు. జిరాయితీ భూమి ఎక్కువగా ఉన్న పాండ్రంగి, రెడ్డిపల్లి, పొట్నూరు గ్రామాల్లో రీ సర్వే జరుగుతుందని, ఇనాం గ్రామ భూ సమస్యలపై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివారావు అసెంబ్లీలో ప్రస్తావించిన నేపథ్యంలో జేసీ ఆదేశాల మేరకు ఇనాం గ్రామమైన బీఆర్ తాళ్లవలసలో భూముల సర్వేను త్వరలో చేపడతామని పేర్కొన్నారు. పద్మనాభం, కృష్ణాపురం ఇనాం భూములపై కోర్టులో స్టేటస్ కో ఉన్నందున ప్రభుత్వ భూముల సర్వే చేస్తామన్నారు. సమావేశంలో డీటీలు చంద్రశేఖర్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రాములోరి సన్నిధిలో సంక్షిప్త రామాయణ హవనం


హవనం చేస్తున్న రుత్వికుడు

ఫొటో:ఎస్ఎంఎల్:2:హవనం చేస్తున్న రుత్విక్‌స్వామి, 2ఎ:పూజలందుకున్న స్వామివారు

సింహాచలం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సింహగిరిపై గంగధార సమీపంలో గల శ్రీసీతారామస్వామి ఆలయంలో సంక్షిప్త రామాయణ హవనాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శ్రీరాముని జనన నక్షత్రం పునర్వసును పురస్కరించుకుని ప్రతినెలా సంక్షిప్త రామాయణం, షడక్షరీ మంత్రాలతో హవనాన్ని నిర్వహించడం ఆచారం. ఈ క్రమంలో మంగళవారం ప్రభాతారాధనల తరువాత లక్ష్మణ, హనుమత్ సమేతంగా సీతారాముల ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై ఉంచి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలను సమర్పించాక పూజాది కార్యక్రమాలను చేపట్టారు. రుత్విక్ స్వాములు రామాయణంలోని సంక్షిప్త రామాయణా(బాలకాండం)న్ని తొలుత పఠిస్తూ, తరువాత శ్రీరామ షడక్షరీ మంత్రాలతో హవనాన్ని వైభవంగా జరిపి మహా పూర్ణాహుతి చేశారు. ప్రధాన కలశాన్ని రుత్విక్ స్వామి శిరస్సుపై దాల్చి అంతరాలయంలో మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు చేసి అందులోని పవిత్ర జలాలతో భక్తులను ప్రోక్షణ గావించారు. భక్తులకు హవన భస్మాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఒరిగిన విద్యుత్ బాక్సును సరిచేయరూ..


ఎండాడ ఎస్ఎల్‌పీ లేఅవుట్ వద్ద ఒరిగిన విద్యుత్ బాక్సు

ఎండాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 8వ వార్డు పరిధి ఎండాడ ఎస్ఎల్‌పీ లేఅవుట్‌లో భూగర్భ విద్యుత్ లైన్లకు సంబంధించిన జంక్షన్ బాక్స్ ఒరిగిపోయింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇక్కడ అమర్చిన అమర్చిన జంక్షన్ బాక్స్ వెనక్కు ఒరిగిపోయింది. ఈ ప్రాంతంలో వైన్ షాపు ఉండడంతో అనేక మంది మందుబాబులు మద్యం తాగి ఇక్కడే తిరుగుతుంటారు. అందువల్ల ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకుండా సంబంధిత అధికారులు ఒరిగిన విద్యుత్ బాక్సును సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

హాకర్స్ జోన్‌ను ఏర్పాటు చేయాలి

మధురవాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 7వ వార్డు పరిధిలోని మిథిలాపురి వుడా కాలనీ, స్వతంత్రనగర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో ఇటీవల ఆపరేషన్ లంగ్స్‌లో భాగంగా బడ్డీలను తొలగించారు. దీంతో పలువురు వ్యాపారులు తమ ఉపాధిని కోల్పోయారు. వీరిలో అర్హులైన వారిని జీవీఎంసీ గుర్తించింది. వారందరికీ గుర్తింపు కార్డులు జారీ చేసి హాకర్స్ జోన్‌లో వ్యాపారాలు చేసుకోడానికి అవకాశం కల్పిస్తామన్నారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి హాకర్స్ జోన్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియను వేగవంతం చేసి తమకు ఉపాధి కల్పించాలని పలువురు చిరు వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే సచివాలయాల ద్వారా స్ట్రీట్ వెండర్లు, బడ్డీలు కోల్పోయిన వారి వివరాలను సేకరించారు. అందువల్ల వ్యాపారాలు చేసుకునేందుకు పక్కాగా స్థలాలు కేటాయించాలని కోరుతున్నారు.

రహదారిపై డెబ్రిస్ తొలగింపు


డెబ్రిస్‌ను తొలగించాక శుభ్రంగా ఉన్న రోడ్డు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సింహాచలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 98వ వార్డు పరిధి శిడగం వీధిలో రోడ్డుపై వేసిన డెబ్రిస్‌ను జీవీఎంసీ అధికారులు తొలగించారు. ఈ నెల 11న 'రోడ్డుపై డెబ్రిస్‌తో అవస్థలు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రోడ్డుపై డెబ్రిస్ వేసిన యజమానిని పిలిచి తక్షణమే తొలగించడంతో పాటు రూ.500 జరిమానా విధించారు. రహదారులపై భవన నిర్మాణ సామగ్రిని కానీ డెబ్రిస్‌ను గానీ వేయడం సమంజసం కాదని, ఎవరైనా అలా చేస్తే జరిమానా విధిస్తామని జీవీఎంసీ అధికారులు హెచ్చరించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కొమ్మాది, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని మధురవాడ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతిన శివ అన్నారు.మంగళవారం ఆయన మాజీ సైనిక ఉద్యోగులతో కలిసి స్వచ్ఛతా హీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా సామాజిక సేవ, సంఘ సేవ, రహదారులపై గోతులను పూడ్చడం, చెత్తాచెదారాన్ని తొలగించారు.

గూగుల్ రాక షురూ

... 5వ పేజీ తరువాయి

విద్యుత్ రాయితీ ఇస్తారు. ఇలా అనేక రాయితీలు ప్రభుత్వం ఇచ్చింది. గూగుల్ పెట్టుబడి రూ.87,520 కోట్లు అయితే అందులో నాలుగో వంతు అంటే సుమారుగా రూ.22 వేల కోట్లు రాయితీలుగా ఇవ్వడానికి ఒప్పందం జరిగింది.

మిన్నంటిన సంబరాలు

గూగుల్ వంటి పెద్ద సంస్థతో ఒప్పందం జరగడంతో నగరంలో సంబరాలు మిన్నంటాయి. తెలుగుదేశం పార్టీ నాయకులు టపాసులు కాల్చి సంతోషం పంచుకున్నారు. ఎంవీపీ కాలనీలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన క్యాంపు కార్యాలయంలో, జిల్లా పార్టీ కార్యాలయంలో గండి బాబ్జీ, సత్యం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, ఉత్తర నియోజకవర్గం నాయకులు శ్యామలా దీపిక, అగర్వాల్ తదితరులు కేకులు కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు.

షరా మామూలే..

... 5వ పేజీ తరువాయి

సాగలేదు. తొలగించిన దుకాణాల్లో దాదాపు సగానికి పైగా మళ్లీ అదే స్థానంలో వెలిశాయి. ఇంతకుముందు స్టీల్, కలపతో చేసిన దుకాణాల్లో వ్యాపారాలు నిర్వహించగా, ఇప్పుడు తోపుడుబండ్లు పెట్టుకొని వ్యాపారాలు చేస్తున్నారు. కొందరైతే ఇంతకు ముందులానే రహదారులను ఆక్రమించి నడిరోడ్డుపైనే లావాదేవీలు నిర్వహిస్తున్నారు. వీటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. జీవీఎంసీ సిబ్బంది రోజూ వారి దగ్గరకు వెళ్లి జేబులు నింపుకొంటున్నారు. దసరా సందర్భంగా ఒక్కో దుకాణం నుంచి వేయి రూపాయల చొప్పున వసూలుచేశారు. అలాగే ఏ వ్యాపారమైతే ఆ సరకును సంచిలో వేసుకుని పట్టుకుపోతున్నారు. ఇవ్వకపోతే అక్కడి నుంచి దుకాణం తీసేయమంటారేమోనని వారు కిమ్మనకుండా అడిగింది ఇస్తున్నారు. ఇవేవీ జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడం లేదు. క్షేత్ర స్థాయి సిబ్బందిని ఈ విషయంలో బాధ్యులను చేయకపోవడం వల్ల వారి అండతోనే వ్యాపారాలు తిరిగి నడుస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో మళ్లీ దుకాణాలు రాకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందని జోనల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు చెప్పకపోవడం మరో లోపం.

ప్రత్యామ్నాయం ఎక్కడ...?

జీవీఎంసీ వద్ద పేర్లు నమోదు చేసుకున్న వ్యాపారులు అందరికీ వెండింగ్ జోన్లు పెట్టి అక్కడ వ్యాపారాలకు అనువైన సదుపాయాలు కల్పిస్తామని జీవీఎంసీ అధికారులు ప్రకటించారు. అవి ఎంతవరకు వచ్చాయో తెలియదు. పెట్టుబడిదారుల సదస్సుకు ముందు ఇవన్నీ జరుగుతాయనే నమ్మకం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రజా ప్రతినిధుల్లోనే వ్యతిరేకత

కూటమి ప్రభుత్వంలో అత్యధిక శాతం శాసనసభ్యులు ఈ దుకాణాల తొలగింపును వ్యతిరేకిస్తున్నారు. అయితే ఆ విషయాన్ని బయట చెప్పడం లేదు. కొందరైతే జీవనోపాధి కోల్పోయిన వ్యాపారులకు సొంత నిధులతో దుకాణాలు ఏర్పాటు చేయించి, వారే వాటిని ప్రారంభించి భుజం తడుతున్నారు.

మాలధారులకు 22 నుంచి నిత్యాన్నదానం

వెంకోజీపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని గ్రామ సేవాసంఘం ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే విధంగా వివిధ మాలదారులకు నిత్యాన్నదాన కార్యక్రమం ఈ ఏడాది నిర్వహిస్తున్నారు. ఈ నెల 22 నుంచి డిసెంబరు 5 వరకు ప్రతీ రోజు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఈ అన్నప్రసాద వితరణ జరుగుతుందని గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు ఆడారి సత్యనారాయణ తెలిపారు. 9 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఈ నిత్యాన్నదానాన్ని ప్రతి సంవత్సరం తప్పకుండా కొనసాగిస్తూ వస్తున్నామన్నా రు. దాతల సాయంతో 41 రోజుల పాటు ఈ భిక్ష కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. మాలదారులందరూఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చకచకా వంతెన నిర్మాణ పనులు



ఆరిలోవ పోలీసుస్టేషన్‌కు వాహనాలు వచ్చేందుకు నిర్మిస్తున్న వంతెన

ఆరిలోవ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న ఆరిలోవ పోలీసు స్టేషన్ కు వాహనాలు రావడానికి నిర్మిస్తున్న వంతెన పనులు చకచకా సాగుతున్నాయి. ఆరు నెలల కిందట సుమారు రూ.కోటితో ఈ వంతెన నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి పనులు వేగవంతగా చేస్తున్నారు. దీనిన్ని అందుబాటులోకి తీసుకొస్తే ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. ప్రస్తుతం అంతావిమ్స్ ప్రధాన గేటు నుంచి వాహనాలు రావడంపై పిర్యాదు అందుతున్నాయి. మరో నెల రోజుల్లో ఈ వంతెన నిర్మాణ పనులు పూర్తి అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు ఆనుకొని ఉన్న సర్వీసు రోడ్డును కలుపుతూ బ్రిడ్జిని నిర్మాణం చేశారు.

17న గణిత పోటీలు

జ్ఞానాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈ నెల 17న మ్యాథమేటిక్స్ 2కె-25 పేరిట అంతర్ కళాశాలల గణిత పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ తెలిపారు. గణిత విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల పోస్టరును మంగళవారం కళాశాలలో ఆవిష్కరించారు. విద్యార్థుల్లో మేధోకౌశలాన్ని, అంతర్గత ప్రతిభాపాటవాలను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు.

ఈ కార్యక్రమంలో గణిత విభాగాధ్యక్షురాలు డా.సుజాత, కె.కె.సౌజన్య, డా.గౌరీ శంకర్, జి.యోజన, ఎస్.శ్రీరాం, సునీత చౌదరి., డా.పి.కె.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి.
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ -2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజి** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 23, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 32, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్ 56, దొండకాయలు 36, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 72, బరబాటి 48, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 60, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 28, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 36, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 100, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

గూగుల్ రాకపై హర్షాతిరేకాలు



'థాంక్యూ లోకేష్ సార్..' అంటూ కృతజ్ఞతలు తెలియజేస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రావడం వల్ల ఉత్తరాంధ్ర యువతకు భారీ ఉపాధి అవకాశాలు లభిస్తాయని తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు.

గూగుల్ రాకను స్వాగతిస్తూ ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద మంగళవారం రాత్రి తెలుగుదేశం శ్రేణులు బాణసంచా కాల్చి సందడి చేశారు.

అనంతరం ఎమ్మెల్యేకు మిఠాయిలు తినిపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖకు అమరావతి స్థాయిలో ప్రాధాన్యం లభిస్తోందని, విశాఖ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించారని వెలగపూడి తెలిపారు. దీంతో రానున్న రోజుల్లో మరిన్ని సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడతాయన్నారు. విశాఖ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు, లోకేశ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

ఏయూలో విద్యార్థుల సంబరాలు..

వెంకోజీపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖకు తీసుకురావడంపై ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు సంబరాలు నిర్వహించారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వద్ద మంగళవారం సాయంత్రం విద్యార్థులంతా బాణాసంచా కాలుస్తూ, చిందులు వేశారు. ఈ సందర్భంగా హేమంత్‌కుమార్ మాట్లాడుతూ పరిపాలన అంటే నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్‌లా చేయాలన్నారు. రాష్ట్ర ఐటీ మంత్రిగా నారా లోకేష్ గూగుల్ డేటా సెంటర్, సీపీ డేటా సెంటర్, టీసీఎస్ డేటా సెంటర్‌తో పాటు కాగ్నిజెంట్ సత్వా టెక్నాలజీస్ వంటి ఎన్నో కంపెనీలు అతి తక్కువ సమయంలో తీసుకువచ్చారన్నారు. గత వైసీపీ ఐటీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాత్రం అల్లం వెల్లుల్లి పేస్టు కంపెనీ, మామిడి తాండ్ర కంపెనీ, అప్పడాలు, పచ్చడ్ల కంపెనీ, బొబ్బట్ల కంపెనీలు వంటివి తెచ్చారని, అందుకనే యువత వైసీపీకి స్వస్తి చెప్పారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో గూగుల్ సీఈవోతో ముఖ్యమంత్రి, ఐటీ మంత్రి లోకేష్ మధ్య జరిగిన ఎంవోయూను స్వాగతిస్తూ తాము ఈ సంబరాలు నిర్వహించామన్నారు. గూగుల్ డేటా సెంటర్‌ను 1గిగా వాటి కెపాసిటీతో, ఒక బిలియన్ డాలర్స్, రూ.83 వేల కోట్ల పెట్టుబడులతో, రూ.105 18 కోట్లు జీడీపీతో, రూ.47,720 కోట్లు వాల్యూ క్రియేషన్‌తో పాటు రానున్న ఐదేళ్లలో 1,82,200 ఉద్యోగాలు రానున్నాయ న్నారు. వీటి అనుబంధ సంస్థల ద్వారా మరో మూడు లక్షల ఉద్యోగాలు వస్తాయని ఆనందాన్ని వ్యక్తం చేశారు. 'థాంక్యూ లోకేష్ సార్..' అంటూ నినాదాలు చేశారు. కూటమి ప్రకటించిన 20 లక్షల ఉద్యోగాలు తప్పకుండా వస్తాయన్న నమ్మకం నిరుద్యోగుల్లో కలిగిందని హేమంత్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ విశాఖ అధ్యక్షుడు ప్రవీణ్, రసుజా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే నిర్మాణ సామగ్రి

- వాహన చోదకులకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



మద్దిలపాలెం రాజేశ్వరి అమ్మవారి ఆలయం రోడ్డుకు సగం వరకు వేసిన పిక్క

మద్దిలపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం రాజరాజేశ్వరి ఆలయం రోడ్డులో భవన నిర్మాణ సామగ్రి నిల్వ చేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పిక్క పోగు చేయడంతో ద్విచక్ర వాహనాలు బోల్తా పడుతుండడంతో వాహన చోదకులు గాయాల పాలవుతున్నారు. రోడ్డు మొత్తం రాయి, పిక్క మేట వేసినట్టు ఉండడంతో బైక్‌లు స్కిడ్ అవుతున్నాయి. ఎదురెదురుగా ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మద్దిలపాలెం సందులో నిర్మాణం కోసం రోడ్డుకు అడ్డంగా లారీలతో పిక్క, ఇసుక తీసుకొచ్చి పోగులుగా వేశారు. రోడు మొత్తం నిర్మాణ సామాగ్రి ఆక్రమించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజుల నుంచి నిర్మాణ సామగ్రి రోడ్డు మీదే ఉండండతో ఇటుగా రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జీఎస్టీ సవరణపై 13వ వార్డులో అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆరిలోవ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మధ్య తరగతి ప్రజల సౌలభ్యం కోసం జీఎస్టీ సవరణపై తీసుకొన్న నిర్ణయం ఎంతో గొప్పదని 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత అన్నారు. మంగళవారం ఆరిలోవ 13 వ వార్డులో ర్యాలీ నిర్వహించి జీఎస్టీ సవరణ వల్ల ఒనగూరే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను అభినందించారు. కేంద్ర తీసుకున్న ఈ నిర్ణయం వల్ల కిరాణా సామానులు, రోజు వారీ నిత్యావసర వస్తువులు, వాహనాలు, గృహోపకరణాల ధరలు తగ్గాయన్నారు. దీంతో కొనుగోలు పెరిగి దేశ ఆర్థిక వ్యవస్థ మరింత పటిష్టమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

రైతు బజార్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి ప్రణాళికలు

- వ్యవసాయ, మార్కెటింగ్ కమిటీ సమావేశంలో అధికారులకు భీమిలి ఎమ్మెల్యే గంటా ఆదేశం

భీమునిపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ప్రజలకు సౌకర్యంగా రైతు బజార్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి ప్రణాళికలుసిద్ధం చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీతో ఆయన సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండాడలో ప్రభుత్వ స్థలం, ఆనందపురంలో నిరుపయోగంగా ఉన్న యార్డులో రైతుబజార్ ఏర్పాటుకు అనుకూలతలను పరిశీలించాలని సూచించారు.అవసరమైతే జంక్షన్‌లో ఉన్న పూలమార్కెట్‌ను యార్డు లోపలకు తరలించడంపై ఆలోచించాలన్నారు. మార్కెట్ యార్డు అభివృద్ధితో పాటు రైతులకు సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి ల క్ష్మీచైతన్య, డైరెక్టర్లు నందిని, రామలక్ష్మి, ఉప్పాడ గౌరి, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

మైత్రీ వాక్ 2.0 పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ రాంబాబు, వివిధ విభాగాధిపతులు

విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న మైత్రీవాక్ 2.0 పోస్టర్‌ను వీసీ జీపీ రాజశేఖర్ మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. హ్యూమన్ జెనెటిక్స్ విభాగం ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూషన్ సహకారంతో డిసెంబరు ఆరో తేదీన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మైత్రీవాక్ నిర్వహిస్తారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు, సైన్స్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు, ప్రొఫెసర్ ఎ.నరసింహారావు, హ్యూమన్ జనిటిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.లక్ష్మి, సెంటర్ ఫర్ సోషల్ ఇంక్లూజన్ డైరెక్టర్ పి.సుబ్బారావు, ప్రొఫెసర్ జి.సుధాకర్, ప్రొఫెసర్ జి.పద్దయ్య పాల్గొన్నారు.

ఏయూలో క్రికెట్ జట్టు ఎంపికలు

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో భాగంగా స్పోర్ట్స్ బోర్డు నిర్వహించనున్న సెంటినరీ క్రికెట్ టోర్నీలో పాల్గొనే జట్టు ఎంపికలు మంగళవారం నిర్వహించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ డైరక్టర్ ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్ పర్యవేక్షణలో గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో జరిగిన ఈ ఎంపికలకు ఏయూ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్‌కు చెందిన క్రికెటర్లు పాల్గొన్నారు.

మరో రెండు రోజులు జరగనున్న ఎంపికలలో ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా, ఏయూ కాలేజ్ ఫార్మాస్యుటికల్ సైన్స్, ఐఎఎస్ఈకి చెందిన క్రీడాకారులు పాల్గొంటారు. ఎంపికలలో పాల్గొనే క్రికెటర్ల బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో ప్రతిభను పరిశీలిస్తున్నారు.

పెదవాల్తేర్ వీధుల్లో చెత్తకుప్పలు.. పట్టించుకోని అధికారులు



రోడ్డుపై పడి ఉన్న చెత్త

పెదవాల్తేరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులోని శ్రీఅసంగానంద ఆశ్రమం, మృత్యుంజయ శివాలయం సమీపంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయని, రోడ్డుల నిండా ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త పేరుకుపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రోడ్డు పక్కనే వ్యర్థాలు వేయడంతో పెంటకుప్పలను తలపిస్తోందని, మల మూత్ర విసర్జన చేయడంతో దుర్గంధం వెదజల్లడంతో అటు వైపు వెళ్లే స్థానికులు, వాహనదారులు ముక్కు మూసుకుని వెళ్తున్నారు. ఇక్కడ చుట్టు పక్కల నివాసితులు చెత్తాచెదారాలను రోడ్డు పక్కనే పడేస్తున్నారని, ఇటీవల కురుస్తున్న వర్షాలకు తడిసి బాగా కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు, అటుగా రాకపోకలు సాగించేవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా చెత్త పేరుకుపోయి ఉంటే రకరకాల వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందని, వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు చెత్తతరలింపు నకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జనసేనలో ప్రతీ కార్యకర్తకు గౌరవం

- పార్టీ బలోపేతం కోసం ప్రజల వద్దకు వెళ్లాలి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కచ్చితంగా పోటీ
- పార్టీ సమావేశంలో మంత్రి మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్, వేదికపై ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయకుమార్, ఇతర నాయకులు

మహారాణిపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ బలోపేతానికి ప్రణాళికలు తయారు చేసి ప్రతి కార్యకర్త ప్రజల వద్దకు వెళ్లాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. మహారాణిపేటలోని అంబికా బాగ్ కల్యాణమండపంలో మంగళవారం ఆ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ జనసేన పార్టీలో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయ్ కుమార్‌లు పార్టీ కోసం కష్టపడి గెలిచారని అన్నారు, జనసేన అంటే సేవా కార్యక్రమాలు చేసే పార్టీగా ముందుకు పోయామని, అదేవిధంగా ప్రశ్నించే పార్టీగా ఎదిగామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో జనసేన పార్టీ కచ్చితంగా పోటీచేస్తుందని స్పష్టంచేశారు. కార్యకర్తలకు పోటీచేసే పరిస్థితి వస్తుందని, అందువల్ల క్షేత్రస్థాయిలో పార్టీ చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు.జనసేన స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాటం చేస్తుందని, ప్రతిపక్షాలు తమ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టు ఆనాడు రాష్ట్ర రాజకీయాలనే మార్చివేసిందన్నారు. పవన్ కల్యాణ్ రాజకీయ ప్రస్థానం ప్రజల భవిష్యత్ కోసమని, రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడులు రావాలని, ఉద్యోగ అవకాశా లు, ప్రజల భవిష్యత్ కోసమే చంద్రబాబును మరో 15 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నారని అన్నారు, కష్టకాలంలో పార్టీ కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జనసేన శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ (దక్షిణ నియోజకవర్గం), పంచకర్ల రమేష్‌బాబు (పెందుర్తి), సుందరపు విజయ్‌కుమార్ (ఎలమంచిలి), డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్‌రెడ్డి, కార్పొరేటర్లు భీశెట్టి వసంతలక్ష్మి, కందుల నాగరాజు, సాదిక్, ఆళ్ల లీలావతి, ఉషశ్రీ, కామేశ్వరి, మేరీజోన్స్, ఎస్ఏ రహమాన్, పి.శివప్రసాద్ రెడ్డి, ఉషాకిరణ్, దుర్గాప్రశాంతి. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐటీలో విశ్వనగరంగా విశాఖ

- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- క్యాంపు కార్యాలయం వద్ద సంబరాలు



ఎంవీపీ కాలనీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట బాణసంచా కాల్చుతున్న టీడీపీ శ్రేణులు

విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గూగుల్ ఒప్పందంతో విశాఖపట్నం ఐటీ విశ్వనగరంగా మారనుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఢిల్లీలో గూగుల్ సంస్థతో సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్ చేసుకున్న ఒప్పందం చరిత్రాత్మకమని కొనియాడారు. రాబోయే 20 ఏళ్లలో విశాఖ ట్రిలియన్ డాలర్ల ఎకానమీ రీజియన్‌గా చేయాలని కృషి జరుగుతోందన్నారు. గూగుల్ వల్ల యువతకు 1.88 లక్షల ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వివిధ రంగాల్లో 12 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చామన్నారు. అనంతరం క్యాంపు కార్యాలయం ముంగిట టపాసులు కాల్చి కార్యకర్తలు, నాయకులతో సంతోషం పంచుకున్నారు. స్వీట్లు పంచిపెట్టారు.

మహిళలకు ఆరోగ్య రక్ష..సఖీ సురక్ష

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



సఖీ సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు,యూసీడీ పీడీ సత్యవేణి

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్య సంరక్షణ కోసమే సఖీ సురక్షా పథకమని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీ ఒకటో సెక్టరు వీఎమ్మార్డీఏ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన మహిళలకు వైద్య పరీక్షా శిబిరంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే వెలగపూడితో పాటు జీవీఎంసీ యూసీడీ విభాగం ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణి ప్రారంభించారు. తూర్పు నియోజకవర్గం పరిధిలోని పలు స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కాళ్ల శంకర్, పళ్ల ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

డెవలప్‌మెంట్ సెంటర్ తీసుకురావాలి

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్



మద్దిలపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో రైడెన్ డేటా సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల ఉపాధి అవకాశాలు రావని, ఉపాధికి అవకాశం లేని డేటా సెంటర్‌కు రూ.వేల కోట్లు రాయితీలను ప్రభుత్వం ఇస్తోందని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. గూగుల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసేలా ఆ సంస్థపై ఒత్తిడి తీసుకొస్తే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గూగూల్ అనుబంధ సంస్థ రైడెన్ డేటా సెంటర్ ఇక్కడకు తీసుకురావడానికి తాము వ్యతిరేకం కాదన్నారు. కాకపోతే డేటా సెంటర్ వల్ల ఉపాధి, ఆదాయం వంటి అంశాలు పరిగణనలోకి తీసుకుని రాయితీలు ఇవ్వాలన్నారు. రైడెన్ డేటా సెంటర్ వల్ల ఉపాధి కాదు కాబట్టి గూగూల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రైడెన్ డేటా సెంటర్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.25 వేల కోట్లు రాయితీలు ఇస్తున్నట్టు ప్రకటించిందని, కానీ రాష్ట్రానికి ఎంత ఆదాయం వస్తుందో తెలపలేదన్నారు. రెవెన్యూ, ఉపాధి కల్పించలేని సంస్థలకు రూ.వేల కోట్లు రాయితీలు,500 ఎకరాల భూములు ఇస్తున్న ప్రభుత్వం కనీసం గూగూల్ డెవలప్‌మెంట్ సెంటరైనా నగరంలో ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

దుకాణదారులకు న్యాయం చేయండి

- భీమిలి ఎమ్మెల్యే గంటాకు సీఐటీయూ నేతల వినతి

భీమునిపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తగరపువలసలో బడ్డీలను తొలగించిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును సీఐటీయూ నేతలు కోరారు. నాయకుడు ఆర్ఎస్ఎన్ మూర్తి కోరారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ 30 ఏళ్లగా తగరపువలసలో ఈఎస్ఐ ప్రహరీగోడను ఆనుకుని 50 నిరుపేద కుటుంబాల వారు బడ్డీలను ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారాలు సాగిస్తున్నారన్నారు. ఇటీవల జీవీఎంసీ ఆ బడ్డీలన్నింటిని తొలగించారుగాని, ప్రత్యామ్నాయంగా స్థలం చూపలేదని, దీంతో ఆయా కుటుంబాలన్నీ ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాయన్నారు. దీనిపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ విషయమై జీవీఎంసీ కమిషనర్‌తో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే గంటాను కలిసిన వారిలో సీఐటీయూ నాయకులు ఎస్.అప్పలనాయుడు, నీలాతి రాము, నర్సింగరావు, ప్రసాద్, కనకరాజు, రామునాయుడు తదితరులు ఉన్నారు.

కరాటే అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీహరి



శ్రీహరిని సత్కరిస్తున్న దృశ్యం

భీమునిపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడిగా భీమిలికి చెందిన కరాటే మాస్టర్ వాసుపల్లి శ్రీహరి ఎన్నికయ్యారు. మంగళవారం నగరంలో జరిగిన విశాఖ కరాటే అసోసి యేషన్ సర్వసభ్య సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా మల్లా సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికలకు పర్యవేక్షకులుగా ఆంధ్రప్రదేశ్ కరాటే అసోసియేషన్ (కేఎఐ) ఉపాధ్యక్షులు చింతలపూడి వెంకటేశ్వరరావు మాస్టర్ వ్యవహరించారన్నారు.

'రైతుబజారు రైతుల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తా'



మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతుబజారు రైతులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారును జిల్లా మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ వి.చంద్రశేఖర్ మంగళవారం సందర్శించారు. సాయంత్రం ఏర్పాటు చేసే స్టాల్స్ విషయంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు ఆయనకు వివరించారు. సాయంత్రం బేరాలు లేనందున కూరగాయలు విక్రయిస్తే ఆర్థికంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రైతులు ఆయనకు వినతి పత్రం సమర్పించారు. మార్కెటింగ్ డైరెక్టర్లు తమ్మినేని పద్మజ, రైతుబజారు ఎస్టేట్ అధికారి పి.కొండబాబు తదితరులు ఉన్నారు.

ఏయూలో క్రికెట్ జట్టు ఎంపికలు

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో భాగంగా స్పోర్ట్స్ బోర్డు నిర్వహించనున్న సెంటెనరీ క్రికెట్ టోర్నీలో పాల్గొనే జట్టు ఎంపికలు మంగళవారం నిర్వహించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ డైరక్టర్ ప్రొఫెసర్ ఎస్.విజయ్‌మోహన్ పర్యవేక్షణలో గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో జరిగిన ఈ ఎంపికలకు ఏయూ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్‌కు చెందిన క్రికెటర్లు పాల్గొన్నారు. మరో రెండు రోజులు జరగనున్న ఎంపికలలో ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా, ఏయూ కాలేజ్ ఫార్మాస్యుటికల్ సైన్స్, ఐఏఎస్ఈకి చెందిన క్రీడాకారులు పాల్గొంటారు. ఎంపికలలో పాల్గొనే క్రికెటర్ల బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో ప్రతిభను పరిశీలిస్తున్నారు.

మాతృశక్తి సమ్మేళనం నేటి నుంచి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 15 నుంచి మాతృమూర్తుల సప్తశక్తి సంగమం మాతృశక్తి సమ్మేళనం జరుగుతుందని దక్షిణ మధ్య క్షేత్ర బాలికా విద్యా ప్రముఖ్, విద్యాభారతి అఖిలభారత సప్తశక్తి సంగం టోలీ సభ్యురాలు డాక్టర్ ధరణిప్రియ తెలిపారు. ద్వారకానగర్‌లోని శ్రీకృష్ణ విద్యా మందిర్‌లో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ కోటి మంది మాతృమూర్తులను కలపాలనే ఉద్దేశంతో సప్తశక్తి సంగమం పేరుతో బుధవారం నుంచి వచ్చే ఏడాది జనవరి 23 వరకు విద్యాభారతి నిర్వహిస్తున్న అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా విద్యాభారతి ఏపీలో 450 సప్తశక్తి సంగమాలు నిర్వహిస్తూ లక్షన్నర మంది మాతృమూర్తులను కలపాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జె.ఉమాదేవి, రామ సత్యనారాయణ, వై.శ్రీధర్ పాల్గొన్నారు.

17న గణిత పోటీలు



సెయింట్ జోసెఫ్‌లో పోస్టరు ఆవిష్కరిస్తున్న దృశ్యం

జ్ఞానాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈ నెల 17న మ్యాథ్‌మేటిక్స్ 2కె-25 పేరిట అంతర్ కళాశాలల గణిత పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ తెలిపారు. గణిత విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల పోస్టరును మంగళవారం కళాశాలలో ఆవిష్కరించారు. విద్యార్థుల్లో మేధో కౌశలాన్ని, అంతర్గత ప్రతిభా పాటవాలను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో గణిత విభాగాధ్యక్షురాలు డా.సుజాత, కె.కె.సౌజన్య, డా.గౌరీశంకర్, జి.యోజన, ఎస్.శ్రీరాం, సునీత చౌదరి., డా.పి.కె.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మృతిచెందిన ఒడిశావాసికి అంత్యక్రియలు

డాబాగార్డెన్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒడిశాకు చెందిన ఇ.చంద్రశేఖర్ (25) అనారోగ్య కారణంగా మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారని ఏయూటీడీ కార్యదర్శి పి.వాసు తెలిపారు. గతంలో చంద్రశేఖర్‌ను 'మిషన్ తమసోమా జ్యోతిర్గమయా' కార్యక్రమంలో టౌటూన్ పోలీసులు తీసుకుని రావడంతో టీఎస్సార్ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించామన్నారు. చంద్రశేఖర్‌కు నెల రోజులుగా వైద్యం అందిస్తున్నప్పటికీ మృతి చెందాడన్నారు. అతని అక్క, బావలకు పలుమార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో చివరికి అంత్యక్రియలు చేశామని తెలిపారు. అతని ఆత్మకు శాంతి చేకూరాలని షెల్టర్‌లో ఉంటున్న నిరాశ్రయులు, సిబ్బంది నివాళులర్పించారన్నారు.

జనసేనలో ప్రతి కార్యకర్తకు గౌరవం

- పార్టీ బలోపేతం కోసం ప్రజల వద్దకు వెళ్లాలి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కచ్చితంగా పోటీ
- పార్టీ సమావేశంలో మంత్రి మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్, వేదికపై ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయకుమార్, ఇతర నాయకులు

మహారాణిపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ బలోపేతానికి ప్రణాళికలు తయారు చేసి ప్రతి కార్యకర్త ప్రజల వద్దకు వెళ్లాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. మహారాణిపేటలోని అంబికా బాగ్ కల్యాణమండపంలో మంగళవారం ఆ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ జనసేన పార్టీలో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయ్‌కుమార్‌లు పార్టీ కోసం కష్టపడి గెలిచారని అన్నారు, జనసేన అంటే సేవా కార్యక్రమాలు చేసే పార్టీగా ముందుకు పోయామని, అదేవిధంగా ప్రశ్నించే పార్టీగా ఎదిగామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో జనసేన పార్టీ కచ్చితంగా పోటీచేస్తుందని స్పష్టంచేశారు. కార్యకర్తలకు పోటీచేసే పరిస్థితి వస్తుందని, అందువల్ల క్షేత్రస్థాయిలో పార్టీ చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. జనసేన స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాటం చేస్తుందని, ప్రతిపక్షాలు తమ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టు ఆనాడు రాష్ట్ర రాజకీయాలనే మార్చివేసిందన్నారు. పవన్ కల్యాణ్ రాజకీయ ప్రస్థానం ప్రజల భవిష్యత్ కోసమని, రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడులు రావాలని, ఉద్యోగ అవకాశాలు, ప్రజల భవిష్యత్ కోసమే చంద్రబాబునాయుడును మరో 15 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నారని అన్నారు, కష్టకాలంలో పార్టీ కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జనసేన శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ (దక్షిణ నియోజకవర్గం), పంచకర్ల రమేష్‌బాబు (పెందుర్తి), సుందరపు విజయ్‌కుమార్ (ఎలమంచిలి), డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్‌రెడ్డి, కార్పొరేటర్లు భీశెట్టి వసంతలక్ష్మి, కందుల నాగరాజు, సాదిక్, ఆళ్ల లీలావతి, ఉషశ్రీ, కామేశ్వరి, మేరీజోన్స్, ఎస్‌పీ రహమాన్, పి.శివప్రసాద్ రెడ్డి, ఉషాకిరణ్, దుర్గాప్రశాంతి. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి పాలనలో విశాఖ శరవేగంతో అభివృద్ధి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జి



మాట్లాడుతున్న గండిబాబ్జి

మహారాణిపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ కృషితో విశాఖ శరవేగంతో అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండిబాబ్జి అన్నారు మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖకు ఐటీ దిగ్గజ సంస్థలు వస్తున్నాయని, విశాఖ ఆర్థిక వ్యవస్థ ఒక ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని చెప్పారు. డేటా సెంటర్లకు విశాఖ వాతావరణం అనుకూలమని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ నాయకులు అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారని అన్నారు. మూడు రాజధానుల పేరుతో డ్రామా ఆడిన జగన్ విశాఖలో రుషికొండ భవనాలు తప్ప మరేమీ నిర్మించలేదని, అది కూడా ప్రజా ధనం దుర్వినియోగం చేసి ప్యాలెస్ నిర్మించారని విమర్శించారు. భవిష్యత్తులో విశాఖకు లక్షల ఉద్యోగాలు రానున్నాయని, ప్రపంచ పటంలో గుర్తింపు వస్తుందని గండిబాబ్జి చెప్పారు. ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులను వైసీపీ అడ్డుకునే ప్రయత్నాలు చేస్తోందని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. టీడీఆర్ విషయంలో ప్రభుత్వం ఉపేక్షించటం లేదని, అక్రమాలపై విచారణ జరుగుతోందని, దొంగ టీడీఆర్‌లను ప్రభుత్వం రద్దు చేస్తుందని స్పష్టంచేశారు.

ఘనంగా జహీర్ అహ్మద్ జన్మదిన వేడుకలు



డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న శ్రీస్వామి వివేకానంద సంస్థ సభ్యులు

విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంఘసేవకులు, వివేకానంద సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఆయన స్వగృహంలో ఘనంగా జరిగాయి. శ్రీస్వామి వివేకానంద సంస్థ ఈ వేడుకలను నిర్వహించింది. సంస్థ సభ్యులు అహ్మద్‌చే పుట్టిన రోజు కేక్ కట్ చేయించారు. అనంతరం పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివేకానంద అనాథాశ్రమానికి సేవలందిస్తున్న జహీర్ అహ్మద్‌ను నిర్వాహకులు శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రౌండ్‌టేబుల్ సంస్థ సభ్యుడు మక్సూద్ అహ్మద్, పలువురు మహిళలు, శ్రీస్వామి వివేకానంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే ఆనందకర జీవితం

- డాక్టర్ కిషోర్‌బాబు



డాక్టర్ కిషోర్‌బాబును అభినందిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ అనేక రకాల సమస్యలతో సతమతమవుతూ విపరీతమైన ఒత్తిడికి గురవుతున్నారని, ఒత్తిడిని జయిస్తే ఆనందకర జీవితం గడపవచ్చని ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ జి.కిషోర్‌బాబు అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నేషనల్ హెచ్‌ఆర్‌డీ నెట్‌వర్క్ విశాఖపట్నం చాప్టర్ కమిటీ ఆధ్వర్యంలో 'ఒత్తిడిని జయించే విధానం'పై మంగళవారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ జి.కిషోర్‌బాబు పలు సూచనలు చేశారు. నిజ జీవితంలో ఎన్ని సమస్యలు వచ్చినా వాటిని తేలిగ్గా తీసుకోవాలన్నారు. చక్కని ప్రణాళికతో స్థిరత్వంగా జీవిస్తూ, మానసిక దృఢత్వాన్ని పెంచుకోవాలని సూచించారు. ఒత్తిడిని ఏ విధంగా జయించవచ్చునో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో చాప్టర్ అధ్యక్షుడు కె.వి.రావు, వివిధ సంస్థల మానవ వనరుల ప్రతినిధులు, విశ్వవిద్యాలయాల ఆచార్యులు పాల్గొని వారి అభిప్రాయాలను తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కిషోర్‌బాబుకు పుష్పగుచ్ఛంఅందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య సాంబశివరావు, శేషగిరిరావు, పి.భాస్కర్, శ్రీనివాస్, ఆర్.సుధాకర్, శ్రీరాములు, కృష్ణకుమార్, శివప్రసాద్, ఎస్‌వీఎస్ సుధాకర్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు



కండువాలు వేసి ఆహ్వానిస్తున్న దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్

అల్లిపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 33వ వార్డు పరిధిలో టీడీపీ స్థానిక అధ్యక్షుడు కర్రి నీలకంఠం ఆధ్వర్యంలో సుమారు వందమంది వైసీపీ శ్రేణులు మంగళవారం దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధిని చూసి పార్టీలో చేరిన వారందరినీ అభినందించారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలను ప్రతీ కార్యకర్త బూత్ స్థాయి నుంచి ఇంటింటికీ తెలియజేయాలని సూచించారు. వార్డులో విభేదాలు లేకుండా కూటమి నాయకులు, టీడీపీ సీనియర్ నాయకులను కలుపుకొని పనిచేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు నీలకంఠం, యువ నాయకుడు సురేష్, భాస్కర్, దాసాన సత్యనారాయణ, వాసుపల్లి రాంకుమార్, రంధి గోపీకృష్ణ, రాజు, పోలారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైసీపీ సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న కె.కె.రాజు, ఇతర నాయకులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 44వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ వైసీపీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంగళవారం నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ దగ్గర సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు సమక్షంలో స్థానికులు, విద్యార్థినీ, విద్యార్థులు సంతకాలు చేశారు. నాయకులు పేడాడ రమణికుమారి, బానాల తరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'నష్టపరిహారం చెల్లింపులో వివక్ష సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న విదసం ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు, పాల్గొన్న ఇతర ప్రతినిధులు

సీతమ్మధార, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాటలో మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, తురకపాలెం ఘటనలో రూ.5 లక్షలా? ఇది వివక్షతో కూడినదని, తురకపాలెం మృతులకూ రూ.25 లక్షల వంతున చెల్లించాలని విస్తృత దళిత సంఘాల (విదసం) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. రామాటాకీస్ రోడ్డు ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి ఎదురుగా గల అంబేడ్కర్ భవన్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 5 నెలల కాలంలో గుంటూరు తురకపాలెంలో కల్తీ నీటి కారణంగా సంభవించిన మరణాలకు నష్టపరిహారం చెల్లింపులో ప్రభుత్వ వివక్ష చూపిందని, ఇది ధర్మం కాదని, తక్షణమే నష్టపరిహారం రూ.25 లక్షలకు పెంచాల్సిందేనన్నారు. తురకపాలెంలో 40 మందికిపైగా మరణిస్తే, నెలలు గడిచినా బాధిత కుటుంబాలను ఆదుకోవాలనే కనీస స్పృహ ప్రభుత్వానికి రాలేదన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, ఉద్యోగం, గృహవసతి కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. చెక్కుల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే అంజనేయులు దళిత సంఘాలను అవమానిస్తూ చేసిన వ్యాఖ్యలపై జాతికి క్షమాపణ చెప్పాలని, ఎమ్మెల్యే దళితుడు అయి ఉండి దళితులను అవమానిస్తే ఇతరులకు జాతి చులకన కాదా? అని ప్రశ్నించారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ పోస్టర్లు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జాజి ఓంకార్, బూల భాస్కరరావు, గుడివాడ ప్రసాద్, యు.ఎస్. రాజు, సీహెచ్ చాలయ్య, కుస్తూరి వెంకటరావు, సన్యాసిరావు పాల్గొన్నారు.

ప్రయాణ వెతలు తీరేదెన్నడో..?



మురళీనగర్ మసీదు రోడ్డులో తవ్వేసిన తారు రోడ్డు



ఊర్వశి జంక్షన్ పాలిటెక్నిక్ కళాశాల రోడ్డులో ఇలా...

మురళీనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నిరంతర తాగునీటి సరఫరా పనుల తవ్వకాలతో రోడ్లు నామ రూపాల్లేకుండా పోతున్నాయి. ఉత్తర నియోజకవర్గంలోని ప్రధాన జంక్షన్లలో ఇటీవలే కోట్ల రూపాయల ఖర్చుతో వేసిన కొత్త తారురోడ్లు దాదాపు ప్రతి 400 మీటర్లకు ఓ చోట పైపులైన్ల అనుసంధానం పేరుతో తవ్వకాలు చేస్తున్నారు. దీంతో రూ.9 కోట్లతో సరిగ్గా ఏడాది క్రితమే వేసిన మురళీనగర్ - సీతమ్మధార- ఆర్‌అండ్‌బీ జంక్షన్ ప్రాంతాల 48ఎ బస్ రోడ్లు ఛిద్రమవుతున్నాయి. ఇదే తరహాలో దిగువన హైవే రోడ్డులోని సర్వీసు మార్గాలు కూడా నీటి సరఫరా పైపులైన్ల అమరిక పనులతో రోడ్లు తవ్వడం... పదే పదే అవే పనులు చేయడంతో వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. సరిగ్గా కళింగనగర్ రోడ్డు బస్టాపు వద్ద, 48ఎ ఆర్టీసీ బస్సు మలుపులు తిరిగే చోట్ల 10 అడుగుల మేర తవ్వకాలు జరిపి పనులు నిర్వహిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే మురళీనగర్ మసీదు జంక్షన్‌లోనూ పనులు పూర్తిచేశారు. అయితే, తిరిగి ఎక్కడా రహదార్ల పునరుద్ధరణ చేస్తున్న మార్గాలు మాత్రం కానరావడం లేదు. హైవేలో పాలిటెక్నిక్ కాలేజీ దగ్గర పనులు పూర్తయి 5 నెలలు కావస్తున్నా అక్కడ కనీసం రోడ్ వర్కులు చేయడం లేదు. ప్రస్తుతం కురుస్తున్న జోరు వానల ధాటికి ఈ రోడ్లు బురదమయమై వాహనదారులు నిత్యం ప్రమాదాల అంచునే తిరుగాడుతున్నారు. జీవీఎంసీ, ఎన్‌సీసీ కంపెనీ వర్గాలు చేపడుతున్న పనుల తీరుపై పర్యవేక్షణ సారించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కార్తీక ఉత్సవాలకు శైవ క్షేత్రాలు సిద్ధం



మాధవధార కొండపై శివాలయం



గాంధీనగర్‌లో అమృతలింగేశ్వరస్వామి

మురళీనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస పూజా మహోత్సవాలకు విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని మహాశివుని మందిరాలు సర్వసన్నద్ధమవుతున్నాయి. మాధవధార కొండపై పురాతన సింహాచల ఉప దేవాలయమైన భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానం వద్ద ఈఓ పర్యవేక్షణలో ఈ నెల 22 నుంచి నవంబరు 20 వరకు కార్తీక మాస ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయానికి సొబగులు అద్దుతున్నారు. భక్తుల దర్శనాలకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఆలయ పరిసరాలు శుభ్రం చేసి సుందరంగా మలుస్తున్నట్లు అర్చకుడు శ్రీనివాస శర్మ తెలిపారు. అదేవిధంగా 50వ వార్డు మాధవధార జీవీఎంసీ హైస్కూలు దగ్గర శివాలయంలోని ఉత్సవాల్లో భాగంగా నవంబరు 1న మందిరంలో ఈశ్వరుడికి క్షీరాభిషేకం, సహస్ర తులసి దళార్చన నుంచి తేదీల వారీగా ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. నవంబరు 21న పోలిపాడ్యమి వరకు ఆలయానికి నిత్యం వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు టి.నారాయణరెడ్డి తెలిపారు. 51వ వార్డు మాధవధార గాంధీనగర్ అమృతలింగేశ్వరస్వామి ఆలయం, 49వ వార్డులోని సత్యానగర్ హైవేలోని కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో ఈఓ పర్యవేక్షణలో ఉత్సవ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

స్టీల్ ప్లాంటులో ప్రమాదం...కన్వేయర్ బెల్ట్ దగ్ధం

విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో మంగళవారం ఉదయం మరో ప్రమాదం చోటుచేసుకుంది. రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు నుంచి థర్మల్ పవర్ ప్లాంటుకు బొగ్గును తరలించే సీసీ-31 కన్వేయర్ బెల్ట్ సెల్ఫ్ ఇగ్నిషన్ సమస్య వల్ల 62 మీటర్ల మేర కాలిపోయింది. దాంతో పాటు కిందనున్న కన్వేయర్ బెల్ట్ 150 మీటర్ల పొడవున పాడైంది. ఈ నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం లేకుండా వేరే కన్వేయర్ల ద్వారా బొగ్గును థర్మల్ పవర్ ప్లాంటుకు తరలించారు. అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేశారు. దీనివల్ల ఆర్థికంగా పెద్ద నష్టం వాటిల్లలేదని ప్లాంటు వర్గాలు తెలిపాయి.

గూగుల్ రాక షురూ

... 5వ పేజీ తరువాయి

విద్యుత్ రాయితీ ఇస్తారు. ఇలా అనేక రాయితీలు ప్రభుత్వం ఇచ్చింది. గూగుల్ పెట్టుబడి రూ.87,520 కోట్లు అయితే అందులో నాలుగో వంతు అంటే సుమారుగా రూ.22 వేల కోట్లు రాయితీలుగా ఇవ్వడానికి ఒప్పందం జరిగింది.

మిన్నంటిన సంబరాలు

గూగుల్ వంటి పెద్ద సంస్థతో ఒప్పందం జరగడంతో నగరంలో సంబరాలు మిన్నంటాయి. తెలుగుదేశం పార్టీ నాయకులు టపాసులు కాల్చి సంతోషం పంచుకున్నారు. ఎంవీపీ కాలనీలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన క్యాంపు కార్యాలయంలో, జిల్లా పార్టీ కార్యాలయంలో గండి బాబ్జీ, సత్యం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఉత్తర నియోజకవర్గం నాయకులు శ్యామలా దీపిక, అగర్వాల్ తదితరులు కేకులు కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు.

గూగుల్ డేటా సెంటర్ రాకపై టీడీపీ సంబరాలు

కంచరపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం కుదరడంతో 55వ వార్డు టీడీపీ నాయకులు మంగళవారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు బండి రంజిత్ ఆధ్వర్యంలో ధర్మానగర్‌లో నిర్వహించిన వేడుకల్లో మాజీ కార్పొరేటర్ ఎస్.అప్పారావు, ప్రధాన కార్యదర్శి రమణ అప్పారావు, యమున, ఇతర నాయకులు, స్థానికులు పాల్గొన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి ఈతలపాక సుజాత ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేస్తు బాణసంచా కాల్చారు.

33,812 మందికి బీపీ

... 5వ పేజీ తరువాయి

క్యాన్సర్ కేసులు గుర్తింపు ఆశించిన స్థాయిలో జరగలేదని ప్రభుత్వం భావిస్తోంది. సుమారు ఏడాదిపాటు అత్యంత పకడ్బందీగా సర్వే నిర్వహించాలని సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీచేశారు. పట్టణాల్లో ఆశ కార్యకర్త, ఏఎన్ఎం, గ్రామీణ ప్రాంతాల్లో ఆశ కార్యకర్త, ఎంఎల్‌హెచ్‌పీ ఇంటింటికీ వెళ్లి స్క్రీనింగ్ చేయనున్నారు. గత కొన్నాళ్లుగా క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో 4.0 సర్వే పూర్తిగా దానిపైనే సాగుతుందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించేలా సర్వే జరగనుందన్నారు.

చెత్త తరలింపులో అక్రమాలు

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టర్ నుంచి రికవరీకి ప్రతిపాదనలు తయారుచేస్తున్నట్టు సమాచారం.

ఇదిలావుండగా సీసీఎస్ ప్రాజెక్టుల నిర్వహణ చూసే కాంట్రాక్టర్లకు మెకానికల్ విభాగంలోని ఒక అధికారి కొమ్ముకాస్తున్నారని, వారికి అనుకూలంగా బిల్లు చెల్లించేలా ఫైల్ పెట్టాలని ఒత్తిడి చేస్తున్నట్టు ఆ విభాగం సిబ్బంది చెబుతున్నారు. కాంట్రాక్టర్లు పైస్థాయిలో పలుకుబడి ఉన్నవారని, తర్వాత ఇబ్బంది పడాల్సి ఉంటుందని తమను బెదిరిస్తున్నట్టు పేర్కొంటున్నారు. ఇటీవల టౌన్‌కొత్తరోడ్డులోని సీసీఎస్ ప్రాజెక్టు కాంట్రాక్టర్‌కు టెర్మినేషన్ నోటీసు ఇవ్వాలని కమిషనర్ కేతన్‌గార్గ్ స్వయంగా ఆదేశించారు. ఆ మేరకు మెకానికల్ విభాగం అధికారులు జారీచేసిన నోటీసుపై ఏఈ, డీఈలు సంతకం చేసినా కాంట్రాక్టర్‌కు అనుకూలంగా ఉన్న అధికారి మాత్రం సంతకం చేయలేదని చెబుతున్నారు. ఏదిఏమైనా 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వరుస కథనాలతో సీసీఎస్ ప్రాజెక్టుల నిర్వహణలో అవినీతికి అడ్డుకట్టపడిందని మెకానికల్ విభాగం సిబ్బంది హర్షం వ్యక్తంచేస్తున్నారు.

షరా మామూలే

... 5వ పేజీ తరువాయి

సాగలేదు. తొలగించిన దుకాణాల్లో దాదాపు సగానికి పైగా మళ్లీ అదే స్థానంలో వెలిశాయి. ఇంతకుముందు స్టీల్, కలపతో చేసిన దుకాణాల్లో వ్యాపారాలు నిర్వహించగా, ఇప్పుడు తోపుడుబండ్లు పెట్టుకొని వ్యాపారాలు చేస్తున్నారు. కొందరైతే ఇంతకు ముందులానే రహదారులను ఆక్రమించి నడిరోడ్డుపైనే లావాదేవీలు నిర్వహిస్తున్నారు. వీటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. జీవీఎంసీ సిబ్బంది రోజూ వారి దగ్గరకు వెళ్లి జేబులు నింపుకొంటున్నారు. దసరా సందర్భంగా ఒక్కో దుకాణం నుంచి వేయి రూపాయల చొప్పున వసూలుచేశారు. అలాగే ఏ వ్యాపారమైతే ఆ సరకును సంచిలో వేసుకుని పట్టుకుపోతున్నారు. ఇవ్వకపోతే అక్కడి నుంచి దుకాణం తీసేయమంటారేమోనని వారు కిమ్మనకుండా అడిగింది ఇస్తున్నారు. ఇవేవీ జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడం లేదు. క్షేత్ర స్థాయి సిబ్బందిని ఈ విషయంలో బాధ్యులను చేయకపోవడం వల్ల వారి అండతోనే వ్యాపారాలు తిరిగి నడుస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో మళ్లీ దుకాణాలు రాకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందని జోనల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు చెప్పకపోవడం మరో లోపం.

ప్రత్యామ్నాయం ఎక్కడ...?

జీవీఎంసీ వద్ద పేర్లు నమోదు చేసుకున్న వ్యాపారులు అందరికీ వెండింగ్ జోన్లు పెట్టి అక్కడ వ్యాపారాలకు అనువైన సదుపాయాలు కల్పిస్తామని జీవీఎంసీ అధికారులు ప్రకటించారు. అవి ఎంతవరకు వచ్చాయో తెలియదు. పెట్టుబడిదారుల సదస్సుకు ముందు ఇవన్నీ జరుగుతాయనే నమ్మకం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రజా ప్రతినిధుల్లోనే వ్యతిరేకత

కూటమి ప్రభుత్వంలో అత్యధిక శాతం శాసనసభ్యులు ఈ దుకాణాల తొలగింపును వ్యతిరేకిస్తున్నారు. అయితే ఆ విషయాన్ని బయట చెప్పడం లేదు. కొందరైతే జీవనోపాధి కోల్పోయిన వ్యాపారులకు సొంత నిధులతో దుకాణాలు ఏర్పాటు చేయించి, వారే వాటిని ప్రారంభించి భుజం తడుతున్నారు.

గూగుల్ రాకపై కూటమి నాయకుల సంబరాలు

» విశాఖలో ఐటీ సంస్థలను నెలకొల్పడానికి ఎంతో కృషి చేస్తున్న సీఎం చంద్రబాబు

» పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు



బాణసంచా కాల్చుతున్న ఎమ్మెల్యే గణబాబు, తదితరులు

గోపాలపట్నం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): విశాఖకు గూగుల్ సంస్థను ఆహ్వానిస్తూ కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. గోపాలపట్నంలోని పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కేంద్ర కార్యాలయం వద్ద ఎమ్మెల్యే పి.గణబాబు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మంగళవారం రాత్రి బాణసంచా కాల్చారు. మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ రూ.87 వేల కోట్ల పెట్టుబడితో విశాఖ నగరంలో ఐటీ సంస్థలను నెలకొల్పడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఐటీ సంస్థల రాక వల్ల 1.88 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. నియోజకవర్గ కూటమి కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్కాపురం: విశాఖలో గూగుల్ సెంటర్ ఏర్పాటుపై ఢిల్లీలో ఒప్పందం కుదిరినందున ఎమ్మెల్యే గణబాబు సూచన మేరకు పారిశ్రామిక ప్రాంతంలో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. కేక్‌లను కట్ చేయడంతో పాటు బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు కూటమి ప్రభుత్వ హయాంలో విశాఖ నగరానికి మరిన్ని సంస్థలు తరలివస్తున్నాయని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు అన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రలో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణమే లక్ష్యం

» డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ పూర్ణిమాదేవి


ఎస్‌ఆర్‌పురంలోని మ్యాజిక్ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న పూర్ణిమాదేవి, తదితరులు

పెందుర్తి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణంతో వినూత్న పారిశుధ్య వ్యవస్థకు శ్రీకారం చుట్టామని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ పూర్ణిమాదేవి పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలోని ప్రతి పల్లెలో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణమే తమ లక్ష్యమన్నారు. విశాఖ జిల్లా పెందుర్తి మండలంలోని ఎస్‌ఆర్‌పురంలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన మ్యాజిక్ డ్రెయిన్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ (సీఆర్డీ) ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఫీల్డ్ స్టాఫ్ మేనేజర్లకు నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.

అనంతరం పూర్ణిమాదేవి మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణంపై గ్రామ పంచాయతీ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ డ్రెయిన్లతో మురుగు నీరు వెంటనే భూమిలోకి ఇంకే విధానం గురించి వివరించాలన్నారు. దీనివల్ల భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. వంద మీటర్ల డ్రెయిన్లను నిర్మించడానికి రూ.నాలుగు లక్షల వ్యయమైతే మ్యాజిక్ డ్రెయిన్‌కు కేవలం రూ.90 వేలు ఖర్చు అవుతుందన్న విషయాన్ని జోరుగా ప్రచారం చేయాలని కోరారు. చీఫ్ కంట్రోలర్ ఆఫీసర్ గోపీచంద్ మాట్లాడుతూ శిక్షణ శిబిరంలోని అంశాలను క్రోడీకరించుకుని పల్లె ప్రజలను మ్యాజిక్ డ్రెయిన్లపై చైతన్యవంతుల్ని చేయాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన క్షేత్ర స్థాయి సిబ్బంది గ్రామంలోని మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణాన్ని పరిశీలించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన పీఆర్, ఎన్‌ఆర్‌జీఎస్ చెందిన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


దుర్వాసన వస్తున్న నేవీ ప్రధాన కార్యాలయం నుంచి కాకతీయ గేటుకు వెళ్లే రోడ్డు

బాబోయ్.. దుర్వాసన!

» భరించలేకపోతున్నామని పలువురు వాహనదారుల ఆవేదన

మల్కాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళం ప్రధాన కార్యాలయం గేటు నుంచి కాకతీయ గేటు వరకు గల ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న పరిశ్రమల నుంచి భరించలేని దుర్వాసన వస్తుండడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఊపిరాడనంతగా కంపు వస్తోందని పేర్కొంటున్నారు. ఈ రహదారిని ఆనుకుని హెచ్‌పీసీఎల్, కోరమాండల్ కంపెనీలకు చెందిన విభాగాలు ఉన్నాయి. ఈ విభాగాల నుంచి భరించలేని దుర్వాసన వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఆనుకుని భారీ ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ ప్రాజెక్టులో చమురు ఉత్పత్తి పనుల కారణంగా భరించలేని దుర్వాసన వెదజల్లుతుంది. ఈ వాసన వల్ల తీవ్రమైన తలనొప్పి, గొంతులో మంటగా ఉండడం, కళ్లు మండడం, శ్వాసకోస ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు ద్విచక్ర వాహనదారులు చెబుతున్నారు. అలాగే కోరమాండల్ కంపెనీకి చెందిన నిర్మాణం కూడా ఈ రహదారి పక్కనే ఉంది. నౌకల ద్వారా ముడిసరకులు వచ్చేటప్పుడు.. వాటిని తరలించేటప్పుడు వెలువడే దుర్వాసన మరీ అధికంగా ఉంటుందని వాపోతున్నారు. ఈ రెండు పరిశ్రమల కాలుష్యంపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


జోగి రమేశ్ ఫొటోలను ప్రదర్శిస్తున్న ప్రసాదుల శ్రీనివాస్, తదితరులు

జగన్, జోగి రమేశ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఏపీఐఐసీ డైరెక్టర్, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యాన్ని ప్రోత్సహిస్తూ.. తద్వారా కూటమి ప్రభుత్వాన్ని ప్రజల్లో అస్థిరపరిచేందుకు కుట్రలు పన్నిన మాజీ సీఎం జగన్, ఆయన అనుచరుడైన మాజీ మంత్రి జోగి రమేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ డైరెక్టర్, టీడీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు, నీచమైన రాజకీయాలను ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. వైసీపీకి రాజకీయాల్లో కొనసాగే నైతిక హక్కు లేదని పేర్కొన్నారు. ప్రజలకు వైసీపీ క్షమాపణలు చెప్పాలన్నారు. సమావేశంలో నాయకులు శివప్రసాద్, అనంత్, అక్కిన లక్ష్మణరావు, వెంకటరమణ, సత్యారావు, గాంధీ, దేముడు, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలతో అక్రమ నిర్మాణం తొలగింపు

వేపగుంట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 98వ వార్డు పరిధి షిప్‌యార్డు కాలనీలో కోర్టు ఆదేశానుసారం ఎటువంటి అనుమతులు లేకుండా చేపడుతున్న భవనాన్ని జోన్-8 పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మంగళవారం కూల్చివేశారు. భవన నిర్మాణ అనుమతులు షార్ట్ ఫాల్‌లో ఉన్నప్పటికీ నిర్మాణ పనులను కొనసాగిస్తుండడంతో మొదటి అంతస్తు నిర్మాణాన్ని తొలగించారు. కార్యక్రమంలో ఏసీపీ రామలింగేశ్వరరెడ్డి, టీపీవో బొపన్న, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వసతుల పేరిట వసూళ్లకు పాల్పడ్డారని బర్ధన్‌నగర్ వాసుల ఆందోళన

» తమకు న్యాయం చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు


ఆందోళన చేస్తున్న బర్ధన్ నగర్ కాలనీకి చెందిన మహిళలు

పెందుర్తి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పేదల ఆవాసాలకు ఇంటి పన్ను, విద్యుత్, ఇతర సదుపాయాలను కల్పిస్తామని తమ వద్ద భారీగా నగదు వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపిస్తూ సుజాతనగర్ సమీప బర్ధన్‌నగర్ కాలనీవాసులు ఆందోళనకు దిగారు. నగదు వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఇంటి వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం కాలనీవాసులు, మహిళలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బర్ధన్‌నగర్‌లో పదేళ్ల కిందట పేదలు పాకలు వేసుకుని నివాసం ఉంటున్నారు. ప్రభుత్వ స్థలంలో నివాసాలు ఉన్నందున షెడ్డులు నిర్మిస్తే హక్కులతో పాటు మౌలిక వసతుల కల్పన జరుగుతాయని శ్రీనివాసరావు, రాంబాబు, త్రినాథ్ అనే వ్యక్తులు నివాసితుల నుంచి నగుదు వసూలు చేశారన్నది ఆరోపణ. ఆ తరువాత ఇంటిపన్ను గురించి వారిని అడిగితే సమాధానం దాటేయడంతో సొమ్ములు వసూలు చేసిన వ్యక్తి ఇంటి వద్ద ఆందోళన చేశారు. అలాగే తమ వద్ద వసూలు చేసిన నగుదును తిరిగి ఇప్పించాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ కేవీ సతీశ్‌కుమార్‌ను వివరణ కోరగా... తమకు అందిన ఫిర్యాదు మేరకు ఇరువర్గాలను స్టేషన్‌కు రప్పించి విచారణ జరుపుతామన్నారు.


దీక్షలో కూర్చున్న వారికి సంఘీభావం తెలుపుతున్న వై.శ్రీనివాసరావు

ఎన్‌ఎంయూ దీక్షలకు రాష్ట్ర కార్యదర్శి సంఘీభావం

కూర్మన్నపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కూర్మన్నపాలెం స్టీల్ సిటీ ఆర్టీసీ డిపో తరలింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 47వ రోజుకు చేరాయి. దీక్షల శిబిరానికి ఎన్‌ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు విచ్చేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిర్దేశించిన లీజును పొడిగించేలా చూడాలని సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లను కోరారు. అనంతరం పదవీ విరమణ చేసిన డిపో అధ్యక్షులు గండి రామకృష్ణ, రాజులను సత్కరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ నాయకులు రామారావు, రాజు, మూర్తి ,శంకరరావు, సూర్యం, నూర్జహాన్, ఏకే శివాజీ, కార్మికులు వాసు, కేఎస్ రావు, ఆర్కే తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుని సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

ఎన్.ఎ.డి.జంక్షన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 52వ వార్డులో బుద్ధుని అభిమాన సంఘాల ఆధ్వర్యంలో దమ్మచక్ర పరివర్తన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్‌ఏడీ ఫ్లైవోవర్ వద్దనున్న బుద్ధుని విగ్రహం నుంచి మర్రిపాలెం రైతు బజారు ఎదురుగా ఉన్న బుద్ధుని పార్కు వరకు శాంతి ర్యాలీ చేపట్టారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బుద్ధ భిక్షువు బంతేటి అనాలియో మాట్లాడుతూ అసమానతలు లేని సమాజానికి బౌద్ధ మతం ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వెంకటరమణ, శ్రీనివాసరావు, సత్యారెడ్డి, వినయ్, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉక్కు దీక్ష 60వ వార్షికోత్సవం

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్‌ను విశాఖలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ దివంగత ఎమ్మెల్యే టి.అమృతరావు కలెక్టరేట్ వద్ద చేపట్టిన దీక్షకు 60 ఏళ్లు పూర్తి కావడంతో బుధవారం ఇక్కడి అమృతరావు విగ్రహం వద్ద వార్షికోత్సవాన్ని జరుపుతున్నట్టు నిర్వాహక కమిటీ ప్రతినిధులు తెలిపారు. అమృతరావు దీక్ష ఫలితంగా స్టీల్ ప్లాంట్‌ను విశాఖలో ఏర్పాటు చేస్తామని నాటి ప్రధాని దివంగత ఇందిరాగాంధీ హామీ ఇచ్చి దీక్షను విరమింపజేశారన్నారు. బుధవారం అమృతరావుకు ఘనంగా నివాళులర్పిస్తామని పేర్కొన్నారు.

కొత్తపాలెం పీఏసీఎస్ మాజీ చైర్మన్ మృతి


దాడి అప్పారావు (ఫైల్)

గోపాలపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, కొత్తపాలెం పీఏసీఎస్ మాజీ చైర్మన్, గోపాలపట్నం వర్తక సంఘం అధ్యక్షుడు దాడి అప్పారావు (76) అనారోగ్యంతో నగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందారు. టీడీపీకి విశేష సేవలందించడంతో పాటు కొత్తపాలెం పీఏసీఎస్‌కు అధ్యక్షుడిగా దశాబ్దంన్నర కాలంపాటు అప్పారావు కొనసాగారు. అలాగే గోపాలపట్నం వర్తక సంఘం అధ్యక్షుడిగా పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో సుపరిచితుడైన అప్పారావు మృతి పట్ల పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, టీడీపీ నాయకులు, గోపాలపట్నం వర్తక సంఘం సభ్యులు విచారం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో బాలుడి ప్రతిభ


పల్లా మోహిత్ శివసాయి యాదవ్

మల్కాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12, 13, 14 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో మల్కాపురం ప్రాంతానికి చెందిన పల్లా మోహిత్ శివసాయి యాదవ్ బంగారు పతకం సాధించాడు. మోహిత్ ఇక్కడి సెయింట్ జోసఫ్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఒకపక్క చదువులో రాణిస్తూనే మరోపక్క బాక్సింగ్‌లో పంచ్‌లు మెరిపిస్తూ పలు అవార్డులను సొంతం చేసుకుంటున్నాడు. పసిడి పతకాన్ని సాధించిన మోహిత్‌ను పలువురు సీనియర్ బాక్సర్లు అభినందించారు.


దాత నితీశ్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఉపాలయాల ముఖద్వారం కోసం రూ.2.5 లక్షల విరాళం

పెదగంట్యాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నెల్లిముక్కు శ్రీపెంటమాంబ ఆలయం ఆవరణలోని ఉపాలయాలకు సంబంధించి ముఖద్వారం ఏర్పాటుకు గాజువాక వర్తక సంఘం అధ్యక్షుడు తిప్పల నితీశ్ రెడ్డి, ప్రణీత దంపతులు రూ.రెండున్నర లక్షలను విరాళంగా అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును ఆలయ నిర్వాహక కమిటీ డైరెక్టర్లు గొందేశి మహేశ్వరరెడ్డి, అప్పలరెడ్డి, వెంకటరమణారెడ్డి, ఎం.రమణ, పి.అప్పలరెడ్డి, కుంచారావులకు అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ సమక్షంలో అందించారు. అనంతరం నితీశ్‌రెడ్డి దంపతులను వారు సత్కరించారు.

ఘనంగా భూలోకమాంబ పండగ


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): హరిజన జగ్గయ్యపాలెం, వెంకటేశ్వర కాలనీ, మిలట్రీ కాలనీ పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవత భూలోకమాంబ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు లకార్పు సత్తిబాబు, రామకృష్ణల ఆధ్వర్యంలో రామాలయం వద్ద నుంచి అమ్మవారి ఘటాలను మేళతాళాలతో భక్తులు ఊరేగింపుగా తెచ్చి ఆలయంలో ప్రతిష్ఠించి పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి పసుపుకుంకుమలు, చీరలతో పాటు ముడుపులు చెల్లించారు. కార్యక్రమంలో కాలనీ నాయకులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బొర్రమాంబకు ప్రత్యేక పూజలు

అగనంపూడి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ఉక్కు నిర్వాసిత ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవత బొర్రమాంబకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని పుష్పాలతో అలంకరించగా, పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో క్రీడా పోటీలు

మల్కాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ములగాడ మండల పరిధిలో గల జీవీఎంసీ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఈనెల 17, 18 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. అండర్-14, అండర్-17 బాలబాలికలకు కబడ్డీ, కోకో, యోగా, అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, చదరంగం పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందినవారు జోనల్ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. ఆసక్తి గలవారు 9703929400, 9133585131 సెల్ నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి,
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ**: శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 23, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 32, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్ 56, దొండకాయలు 36, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 72, బరబాటీ 48, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 60, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 66, కీర దోస 28, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 36, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 100, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్రాయ్

రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270


విద్యార్థినులతో సెల్ఫీ దిగుతున్న హీరో కిరణ్ అబ్బవరం

విజ్ఞాన్‌లో సినీ హీరో కిరణ్ అబ్బవరం సందడి

అగనంపూడి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 'కె-ర్యాంప్' సినిమా ప్రమోషన్‌లో భాగంగా హీరో కిరణ్ అబ్బవరం మంగళవారం సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. తన సినీ ప్రయాణం గురించి వివరించారు. విద్యార్థులను కలుసుకోవడం చాలా ఆనందగా ఉందని, అందరూ ఇష్టంతో కష్టపడి చదువుకుని తమ కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. రొమాంటిక్ కామెడీ కథతో తెరకెక్కిన 'కె-ర్యాంప్' చిత్రం ఈ నెల 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల అవుతుందని, అదరూ ఆదరించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో సరదాగా సెల్ఫీ దిగారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుంధతి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

పెదగంట్యాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణ పట్ల తల్లిదండ్రులే ప్రత్యేక శ్రద్ధ చూపాలని పెదగంట్యాడ ఎంఈవో కె.రమణాజీ అన్నారు. నెల్లిముక్కు అంగన్‌వాడీ కేంద్రంలో పెదగంట్యాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన బాలికల సంరక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొన్ని కుటుంబాల్లో ఆడపిల్లల అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని, దీంతో వారిలో ఆత్మస్థైర్యం దెబ్బతింటుందన్నారు. అనంతరం పెదగంట్యాడ నిర్వాసిత కాలనీలో ర్యాలీ చేపట్టారు. పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలను చెల్లించాలని నిరసన


తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వీవీవీ ఉపాధ్యాయులు, సిబ్బంది

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ విశాఖ విమల విద్యాలయంలో పనిచేసిన ఉపాధ్యాయులకు పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇక్కడి తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ వీవీవీ పాఠశాలను మూసివేయడంతో తాము కుటుంబాలతో రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ మూసేస్తున్నట్టు కనీసం ఉపాధ్యాయులకు, సిబ్బందికి సమాచారం ఇవ్వకపోవడం దారుణమని వాపోయారు. తమకు తగిన న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పాఠశాలను నడిపించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వార్డుల్లో తాగునీటి సమస్య పరిష్కారం

కూర్మన్నపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86, 87 వార్డుల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.10 లక్షలతో మోటార్లు వేసి సమయానికి ప్రజలకు నీరందేలా కృషి చేశామని కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. వార్డు పరిధిలోని సిద్ధార్థనగర్‌లో మంగళవారం 12 ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్ వద్ద తాగునీటి విభాగ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కమిషనర్ కేతన్ గార్గ్ సిద్ధార్థనగర్ ప్లాంట్‌ను పరిశీలించినప్పుడు పలు సమస్యలను వివరించామన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు డీఈ శ్రీనివాసరావు, ఏఈ కేదారినాథ్‌లు 86వ వార్డుకు 3 మోటార్లు, 87వ వార్డుకు 3 మోటార్లను అమర్చడంతో సమస్య పరిష్కారమైందన్నారు. సమావేశంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎస్ఎస్ విజయరామరాజు, నాయకులు బొట్టా ప్రకాశ్, రాజన్‌రాజు, బలిరెడ్డి నాగేశ్వరరావు, సునీల్, జి.విశ్వేశ్వరరావు, ఎం.పరమానందం, సన్యాసిరావు, దానయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పైడితల్లమ్మ ఉత్సవాలు

ఆటోనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డు పరిధి శ్రీనివాస నగర్, ఎర్రగడ్డ కాలనీ, శ్రామిక నగర్ ప్రాంతాల ప్రజలు ఆరాధ్య దేవత శ్రీపైడితల్లమ్మ ఉత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. ఆలయ కమిటీ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి మేలుకొలుపు, పంచామృతాభిషేకాలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పైడితల్లమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద పరస కార్యక్రమం జరిగింది. అమ్మవారి ఊరేగింపులో సాంస్కృతిక సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కూటమి నాయకులు కేవీఎస్ శంకరరావు, పాల రమణ, కేవీ సూరిబాబు, తుంపాల రమేశ్, ఆలయ కమిటీ ప్రతినిధులు బి.సత్యారావు, బి.రమణ, మోహన్‌కృష్ణ, ఎ.రామకృష్ణ, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగులకు వేతన బకాయిలు చెల్లించాలి

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు తక్షణమే వేతన బకాయిలను చెల్లించాలని ఇంటక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. ప్లాంటులో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేతనాల కోసం ఉద్యోగులు ఎదురుచూడాల్సిన పరిస్థితులు మారాలని, ఉద్యోగుల వేతనాలపై ఆంక్షలు తగదన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన పలు ఆర్థిక ప్రయోజనాల నగదును సంస్థ చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం భావ్యం కాదన్నారు. ఉక్కు అమ్మకాలు పెరిగినప్పటికీ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు వెంకన్న, ప్రసాద్, జగదీశ్, రమణ, ఎస్ఏ నాయుడు, రవికుమార్, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గంగవరంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం

పెదగంట్యాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సమాజంలో స్త్రీ, పురుష నిష్పత్తి సమతుల్యత తప్పుతుందని, దీనిని సరిచేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి నీలవేణి అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మంగళవారం గంగవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి ఆడపిల్లను ఎంతో భద్రంగా కాపాడుకోవాలన్నారు. పెదగంట్యాడ ఎంఈవో కె.రమణాజీ మాట్లాడుతూ ఆడపిల్లల సంఖ్య పెరగాల్సి ఉందన్నారు. అనంతరం బాలికలకు క్విజ్, వ్యాసరచన, పోటీలు నిర్వహించి, విజేతలైన బహుమతులు అందజేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, కార్యకర్తలు దుర్గమ్మ, శాంతి, దేవుడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

91వ వార్డులో ఎమ్మెల్యే గణబాబు పర్యటన


గోపాలపట్నం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 91వ వార్డు లక్ష్మీనగర్, జయప్రకాశ్ నగర్ ప్రాంతాల్లో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు మంగళవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్ దీపాల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణతోపాటు స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి స్థాయిలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీ శంకరరావు, జీవీఎంసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో బహుళ ప్రయోజనాలు

కూర్మన్నపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో వినియోగదారులకు బహుళ ప్రయోజనాలు కలుగుతున్నాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు రాజులపాలెంలో మంగళవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ముఠా కార్మికులతో కలిసి పలు కాలనీలకు వెళ్లి ప్రజలకు జీఎస్టీ ప్రయోజనాలను వివరించారు. టీడీపీ నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, ప్రకాశ్, డీవీ అప్పారావు, పి.దానయ్య, రాజన్‌రాజు, మాటూరి రాము, కె.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వినోదాన్ని పంచే చిత్రం 'కె.ర్యాంప్'

» హీరో కిరణ్ అబ్బవరం



మాట్లాడుతున్న హీరో కిరణ్ అబ్బవరం

మహారాణిపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కామెడీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా 'కె.ర్యాంప్' అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. హాస్య మూవీస్ పతాకంపై రాజేష్, శివ నిర్మాతలుగా జైన్స్ నాని దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం, యుక్తికి హీరో,హీరోయిన్లుగా నటించిన సినిమా ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం హోటల్ గ్రీన్‌పార్కులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూఈ నెల 18న సినిమా విడుదలవుతుందన్నారు. అన్ని వయసుల వారిని అలరిస్తుందన్నారు. హీరో కుమార్ పేరుతో అల్లరి చిల్లరి క్యారెక్టర్ అని, హీరోయిన్ యుక్తికి కొంత పిచ్చి ఉన్న గర్ల్ ఫ్రెండ్ పాత్రలో ఆకట్టుకుంటుందన్నారు. చేతన్ సంగీతం అద్భుతంగా ఉందన్నారు. నరేష్, సాయికుమార్ పాత్రలు బలమైనవని, సినిమా ఒక వైబ్ క్రియేట్ చేస్తుందన్నారు.

అత్యవసర వేళల్లో అంబులెన్స్‌లకు దారివ్వండి

» ప్రజలకు విజ్ఞప్తి చేసిన 108 సర్వీసెస్ జిల్లా మేనేజర్ సురేష్

విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులను తీసుకెళ్లే అంబులెన్స్‌లకు దారి ఇవ్వడం ద్వారా వేగంగా వెళ్లేందుకు సహకరించాలని 108 సర్వీసెస్ జిల్లా మేనేజర్ సురేష్ విజ్ఞప్తి చేశారు. నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో 108 వాహనాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ 108 వాహనానికి కాల్ చేసినా సమయానికి రావడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయని, ఒక ఆస్పత్రి నుంచి మరో ఆస్పత్రికి తరలించే రోగుల సంఖ్య పెరగడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అదే సమయంలో కొన్ని చోట్ల 108 వాహనాలు వెళ్లేందుకు మార్గాన్ని ఇవ్వకపోవడం వల్ల కూడా సమస్యలు వస్తున్నాయన్నారు. ప్రజలు అత్యవసర కేసులకు మాత్రమే 108 వాహనానికి ఫోన్ చేయాలని, చిన్న సమస్యలకు చేయడం వల్ల మరోచోట అత్యవసర పరిస్థితిలో ఉన్న రోగికి ఇబ్బంది కలుగుతోందన్నారు.

ఆరోగ్యం మన చేతుల్లోనే..

సమస్యలకు అపరిశుభ్రతే కారణం

» పది రకాల వ్యాధుల వ్యాప్తికి అవకాశం

» హ్యాండ్ వాష్‌పై అవగాహన తప్పనిసరి

» ఆహారం తీసుకునేముందు కనీసం 15 సెకెన్ల పాటు సబ్బుతో కడగాలి

» చిన్నారులకు అవగాహన కల్పించాలి



నేడు అంతర్జాతీయ హ్యాండ్ వాష్ డే

విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): **అపరిశుభ్రమైన చేతులు అనారోగ్యానికి కారణమవుతాయి. ఏదైనా తినే ముందు చేతులను శుభ్రం చేసుకోవడం ద్వారా అనేకరకాల ఇన్‌ఫెక్షన్లు, వ్యాధుల బారిన పడకుండా కాపాడుకునే వీలుంది. చేతులను శుభ్రం చేసుకోవడంపై చాలామందికి సరైన అవగాహన లేదు. ముఖ్యంగా చిన్నారులకు దీనిపై అవగాహన కల్పించడం ద్వారా ఇన్‌ఫెక్షన్ల ముప్పు నుంచి రక్షించే అవకాశం ఉంటుంది. చేతులను శుభ్రం చేసుకోవడంపై అవగాహన కల్పించేందుకు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఏటా అక్టోబరు 15న వరల్డ్ హ్యాండ్ వాష్‌డే నిర్వహిస్తోంది. ఈ ఏడాది గ్లౌవ్స్ వేసుకున్నా చేతులను పరిశుభ్రంగా ఉంచుకుందాం' థీమ్‌తో నిర్వహిస్తున్నారు.**

ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్రించే వరకు అనేక పనులకు చేతులే ఆధారం. చేతులను పరిశుభ్రం చేసుకోకుండానే ఆహారం తీసుకుంటే అనేక రకాల క్రిములు శరీరంలో చేరి అనారోగ్యానికి గురిచేస్తాయి. ఈ నేపథ్యంలో పని పూర్తిచేసిన తరువాత, ఆహారం తీసుకునే ముందు తప్పనిసరిగా చేతులను సబ్బుతో పరిశుభ్రం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ విషయం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఐక్యరాజ్య సమితి 2008 నుంచి వరల్డ్ హ్యాండ్ వాష్ డే నిర్వహిస్తోంది. దేశంలో దీనిని సెలబ్రిటీలు ప్రమోట్ చేస్తే అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

గ్లౌవ్స్ పూర్తి రక్షణ కాదు

ఆరోగ్య రంగంతోపాటు మరిన్ని సెక్టార్స్‌లో పనిచేసే సిబ్బంది చేతులకు గ్లౌవ్స్ ధరించి పనులు చేస్తుంటారు. చాలా మంది గ్లౌవ్స్ ధరించామన్న ఉద్దేశంతో చేతులను శుభ్రం చేసుకోకుండా ఆహార పదార్థాలను చేతులతో తీసుకుంటారు. గ్లౌవ్స్ ధరించినా అనేక రకాల ఇన్‌ఫెక్షన్లకు కారణమయ్యే వైరస్‌లు, బాక్టీరియాలు చేతుల్లో ఉండిపోతాయని నిపుణులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని ఆయా సెక్టార్స్‌లో పనిచేసే ఉద్యోగులకు అవగాహన కల్పించేలా ఈ ఏడాది థీమ్‌గా ఎంపిక చేశారు. గ్లౌవ్స్ 100 శాతం రక్షణ కల్పించవని నిపుణులు సూచిస్తున్నారు.

శుభ్రంగా ఉన్నట్టు కనిపించినా..

సాధారణంగా చేతులను శుభ్రం చేసుకునేందుకు చాలా మంది ఆసక్తి చూపించారు. తూతూమంత్రంగా చేతులను శుభ్రం చేసుకోవడంతో ఫలితం ఉండదు. చేతులు బాగానే కనిపించినా వ్యాధులకు కారణమయ్యే బాక్టీరియాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. సూక్ష్మదర్శినితో పరిశీలిస్తే లక్షల బాక్టీరియాలు కనిపిస్తాయని, చేతులను శుభ్రం చేసుకోకుండా ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల అవన్నీ శరీరంలోకి ప్రవేశించి వ్యాధులకు గురిచేస్తాయంటున్నారు. చిన్నారులు తమకు తెలియకుండానే వివిధ రకాలు పనులు చేస్తుంటారు. చేతులను శుభ్రం చేసుకోరు. ఇది ప్రమాదకరం. ఈ నేపథ్యంలో పిల్లలు తినేందుకు వచ్చే ప్రతిసారీ చేతులను శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించారు.

అందరికీ అవసరం

చేతులను శుభ్రంగా ఉంచుకోవడం అందరికీ అవసరం. ఇంట్లో పాకుతూ ఉండే పిల్లాడి నుంచి, ఇంటి, వంట పనిలో బిజీగా ఉండే గృహిణి, స్కూల్‌కు వెళ్లే పిల్లలు, ఉద్యోగి, విభిన్న వృత్తులు చేసే కార్మికులు, కూలీలు వృత్తిగత, వ్యక్తిగత కార్యక్రమాల వల్ల కొన్ని వేల బాక్టీరియాలు చేతుల్లోకి చేరే అవకాశముంటుంది. వాటిని నాశనం చేయాలంటే చేతులను శుభ్రం చేసుకోవడం ఒక్కటే మార్గం. ముఖ్యంగా రెండు సందర్భాల్లో చేతులను పరిశుభ్రం చేసుకోవడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకునే అవకాశం ఉంది. భోజనానికి ముందు, టాయిలెట్‌కు వెళ్లి వచ్చిన తరువాత సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి.



పది రకాల వ్యాధులకు విముక్తి

చేతులను పరిశుభ్రంగా ఉంచుకోకుండా ఆహారం తీసుకోవడం వల్ల విరేచనాలు, వాంతులు, పచ్చకామెర్లు, టైఫాయిడ్, న్యుమోనియా, మెదడువాపు వ్యాధి, కళ్ల కలక, చర్మ వ్యాధులు, అమీబియాసిస్ (కడుపునొప్పి, రక్తంతో కూడిన విరేచనాలు), స్వైన్‌ఫ్లూ, టీబీ వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. చేతులను శుభ్రం చేసుకోకపోవడం వల్ల ఏటా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది చిన్నారులు వివిధ రకాల అనారోగ్య సమస్యలకు గురై మృత్యువాతపడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. చేతులను శుభ్రం చేసుకోవడం వల్ల పదిరకాల జబ్బుల్లో 70 శాతం నివారించేందుకు అవకాశం ఉంది.

ఇలా చేయాలి

ప్రతిసారీ ఆహారం తీసుకునే ముందు చేతులను కనీసం 15 సెకన్లపాటు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. అప్పుడే క్రిములు, బాక్టీరియా నశించే అవకాశముంది. ముందు రెండు అర చేతులను రుద్దుకోవాలి. తరువాత చేతి వేళ్ల మధ్య ఉన్న భాగాన్ని గోళ్లను, అరచేతి వెనుక భాగాన్ని శుభ్రం చేసుకోవాలి. అనంతరం పొడి వస్త్రంతో తుడుచుకోవాలి.

పరిశుభ్రమైన చేతులతో వ్యాధులకు దూరం



చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనేక వ్యాధులకు దూరమయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా పిల్లలకు హ్యాండ్ వాష్ పట్ల అవగాహన కల్పించాలి. దీనిని ఫస్ట్ లైన్ డిఫెన్స్‌గా చెప్పవచ్చు. సీరియస్ ఇన్‌ఫెక్షన్లను కూడా నియంత్రించేందుకు అవకాశం ఉంది. ఈ ఏడాది థీమ్ ప్రకారం హెల్త్ కేర్ రంగంలో పనిచేసే వారు గ్లౌవ్స్‌ను ధరించడం వల్ల చేతులు పరిశుభ్రంగా ఉంటాయని భావిస్తుంటారు. గ్లౌవ్స్ తీసిన తరువాత చేతులను శుభ్రం చేసుకుంటేనే ఫలితం ఉంటుంది.

- డాక్టర్ శాశ్వత్ మహంతి, చిన్న పిల్లల వైద్య నిపుణుడు, రెయిన్ బో హాస్పిటల్

గూగుల్ డేటా సెంటర్‌తో ప్రగతి పరుగులు

» వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్

సీతమ్మధార, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గూగుల్ డేటా సెంటర్ రావటంతో విశాఖ అభివృద్ధి పథంలో పయనిస్తుందని, భవిష్యత్తులో నగరం రూపురేఖలు మారిపోతాయని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ అన్నారు. ఢిల్లీలో గూగుల్ సంస్థతో ఒప్పందం జరిగిన సందర్భంగా సత్యం కూడలిలో మంగళవారం రాత్రి ఘనంగా సంబరాలు నిర్వహించారు. గూగుల్ సెంటర్ పేరుతో భారీ కేక్ కట్ చేశారు. ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు చేయటం శుభ పరిణామమని, ఈ ఒప్పందం ఉత్తరాంధ్రను ప్రపంచ పటంలో నిలపనుందన్నారు. సుమారు 1.88 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతో పలు సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లకు ఉత్తరాంధ్ర యువత, ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. యువతకు బంగారు భవిష్యత్తు కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక, సునీల్ అగ్రవాల్, టీడీపీ 24వ వార్డు అధ్యక్షురాలు బర్ల పద్మలత, బర్ల బాలకృష్ణ, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఈతలపాక సుజాత, కూటమి నాయకులు గొంప ధర్మారావు, నమ్మి రవికుమార్, బొడ్డేటి మోహన్, కొయిలాడ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో సంబరాలు

గూగుల్ సెంటర్ విశాఖకు రావడం రాష్ట్రానికి గర్వకారణమని టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జి అన్నారు. ఢిల్లీలో కుదిరిన ఒప్పందాన్ని స్వాగతిస్తూ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి మిఠాయిలు తినిపించుకుని వేడుకలు జరిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల చొరవతోనే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటవుతోందన్నారు. ఎద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయన్నారు. గూగుల్ డేటా సెంటర్‌పై వైసీపీ నాయకుడు అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలు ఖండిస్తున్నామన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్, లొడగల కృష్ణ, పుచ్చా విజయ్‌కుమార్, నక్కా కనకరాజు, ఈతలపాక సుజాత, విల్లూరి చక్రవర్తి, పాల్గొన్నారు.

విమానాశ్రయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

» జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

గోపాలపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విమానాశ్రయ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం లో మంగళవారం విమానాశ్రయ పర్యావరణ కమిటీతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విమానాశ్రయ పరిసరాల్లో డ్రెయిన్ల ద్వారా మురుగు నీరు, వర్షం నీరు సాఫీగా దిగువకు ప్రవహించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోర్టు ట్రక్ పార్కింగ్ ప్రాంతంలో లారీ డ్రైవర్లు ఆహార వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. పక్షులు సంచరిస్తే విమాన రాకపోకలకు ప్రమాదం కలుగుతుందని, నిరంతరం పర్యవేక్షించాలన్నారు. విమానాశ్రయ గోడ సమీపంలో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ కాలువ, సమీపంలోని గెడ్డల్లో పూడిక తొలగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎయిర్ పోర్ట్ అథారిటీ, విశాఖపట్నం పోర్ట్, ఐఎన్ఎస్ డేగా, జీవీఎంసీ, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రంజీ ట్రోఫీకి ఆంధ్ర జట్టు

» నేడు ఉత్తరప్రదేశ్‌తో తొలి మ్యాచ్

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రంజీ ట్రోఫీలో పాల్గొనే ఆంధ్ర జట్టును మంగళవారం ప్రకటించారు. రికీ భుయ్ (కెప్టెన్), కె.ఎస్.భరత్ (వికెట్ కీపర్), అభిషేక్ రెడ్డి, ఎస్.కె.రషీద్, కరణ షిండే, పీవీఎస్ఎన్.రాజు, కె.వి.శశికాంత్, సౌరభ్‌కుమార్, వై.పృథ్వీరాజ్, టి.విజయ్, ఎస్.ఆశిష్, అశ్విన్‌హెబ్బర్, రేవంత్‌రెడ్డి, కె.సాయితేజ, సీహెచ్.స్టీఫెన్, వై.సందీప్ ఆంధ్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఇటీవల ఆంధ్ర సీనియర్ జట్టుకు న్యూజిలాండ్‌కు చెందిన గ్యారి స్టీడ్‌ను హెడ్ కోచ్‌గా, పీటర్ డోంకెర్స్‌ను సహాయ కోచ్‌గా నియమించింది. ఆంధ్ర రంజీ జట్టుకు విజయనగరంలో నిర్వహించిన శిక్షణ శిబిరం ముగించింది. ఎలైట్ గ్రూప్-ఎలో బుధవారం కాన్పూర్‌లో ఉత్తరప్రదేశ్‌లో తొలి మ్యాచ్ ఆడనుంది.

ఆర్టీసీ పంచారామ క్షేత్రదర్శని

» ప్రత్యేక ప్యాకేజీ రూపొందించిన విశాఖ రీజియన్ అధికారులు

ద్వారకాబస్‌స్టేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసం సోమవారాల్లో భక్తులు ఒకే రోజు ఐదు ప్రముఖ శివాలయాలను సందర్శించుకుని అదే రోజు తిరిగి తమ ఇళ్లకు చేరుకునేందుకు వీలుగా ఆర్టీసీ అధికారులు పంచారామ క్షేత్రదర్శిని పేరిట ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు. కార్తీకమాసంలో ప్రతి ఆదివారం సాయంత్రం 5 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బస్సు బయలుదేరి సోమవారం ఉదయానికి అమరావతి చేరుకుంటుంది. అమరేశ్వరుని దర్శించుకున్న తరువాత, భీమవరం భీమేశ్వరుని, ఆ తరువాత పాలకొల్లు క్షీరరామలింగేశ్వరుని దర్శించుకుంటారు. అక్కడనుంచి ద్రాక్షారామం చేరుకుని భీమలింగేశ్వరుని దర్శించుకున్న తరువాత , సామర్లకోట కుమార రామలింగేశ్వరుని దర్శనానంతరం అదే రోజు రాత్రికి బస్సు విశాఖకు చేరుకుంటుంది. ప్రయాణచార్జీ ఒక్కొక్కరికి సూపర్‌లగ్జరీకి రూ.2,200, అల్ట్రాడీలక్స్‌కు రూ. 1,150, ఇంద్ర సర్వీస్‌కు రూ.2,800. ఆసక్తిగలవారు ఏపీఎస్‌ఆర్టీసీ ఆన్.ఇన్‌లో టికెట్ రిజర్వుచేసుకోవచ్చునని ఆర్ఎం అప్పలనాయుడు తెలిపారు.

లంబసింగికి టూర్ ప్యాకేజీ

కార్తీకమాసంలో లంబసింగి సందర్శనకు వెళ్లేందుకు, ఆర్టీసీ లంబసింగి టూర్ ప్యాకేజీ ప్రకటించింది. శని, ఆదివారాల్లో తెల్లవారుజామున 3 గంటలకు ద్వారకాబస్‌స్టేషన్ నుంచి ప్రత్యేక సర్వీసులు బయలుదేరి లంబసింగి, తాజంగి డ్యామ్, కొత్తపల్లి వాటర్‌ఫాల్, పాడేరు మోదమాంబ ఆలయం, కాఫీతోటలు సందర్శించుకుని అదే రోజురాత్రికి విశాఖకు చేరుతాయి. ప్రయాణ చార్జీ ఒక్కొక్కరికి అల్ట్రా డీలక్స్ రూ.800, ఎక్స్‌ప్రెస్ రూ.650. ఈ సర్వీసులకు స్త్రీశక్తి పథకం వర్తించదని ఆర్ఎం ప్రకటించారు.

ధారమట్టం వెళ్లేందుకు

ధారమట్టం వెళ్లేవారికోసం ప్రత్యేక సర్వీసులను నడపనున్నారు. శని, ఆదివారాల్లో ఉదయం 7 గంటలకు ద్వారకాబస్‌స్టేషన్ నుంచి బయలుదేరి ధారమట్టంలోని శివాలయం, వాటర్ ఫాల్స్, అల్లూరి మ్యూజియం, బొజ్జన్న కొండ దర్శించుకుని రాత్రికి తిరిగి విశాఖ చేరుతాయి. ప్రయాణ చార్జీ ఒక్కొక్కరికి సూపర్‌లగ్జరీ రూ.650, అల్ట్రాడీలక్స్ రూ. 550గా నిర్ణయించారు. వివరాలకు 9959225602, 9052227083, 9959225594, 9100109731 నంబర్లలో సంప్రతించాలన్నారు.

హత్య కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

» ఆరేళ్లుగా తప్పించుకుని తిరుగుతున్నవైనం

» నక్కపల్లి అడ్డురోడ్డు వద్ద పట్టుకున్న పోలీసులు

» వివరాలు వెల్లడించిన ఏసీపీ నరసింహమూర్తి


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నరసింహమూర్తి, (ఇన్‌సెట్లో) రాఘవరాజు

ఆరిలోవ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి పాశవికంగా హత్య కేసులో ప్రధాన నిందితుడు కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకుని పారిపోయాడు. అతడి కోసం ఆరేళ్లగా పోలీసులు గాలిస్తుండగా మంగళవారం అనకాపల్లి జిల్లా నక్కపల్లి అడ్డురోడ్డు వద్ద గుర్తించి, అరెస్టు చేశారు. ఈ వివరాలను ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి విలేకరులకు వివరించారు. ఆరిలోవ బాలాజీనగర్‌కు చెందిన తిరుమలరాజు రాఘవ రాజు అలియాస్ టింకు (42) పాతకక్షల నేపథ్యంలో మరో ఆరుగురితో కలిసి 2011 జూన్ 12న మధ్యాహ్నం ఒంటి గంట సమయం సెయింట్‌ఆన్స్ స్కూలు వెనుక పందిరి రవి అనే వ్యక్తిని కత్తులతో నరికి చంపేశారు. మృతదేహాన్ని పక్కనున్న పొదల్లో పడేసి పరారయ్యారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు పందిరి ప్రకాశ్ ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు దర్యాప్తు చేసి ఏడుగురిపై రౌడీషీట్ తెరిచారు. కాగా ఈ కేసులో 2019 జూలై 24న కోర్టులో జరిగిన విచారణకు హాజరుకావాల్సిన తిరుమలరాజురాజు రాఘవరాజు రాలేదు. ఎస్సీ ఎస్టీ కోర్టులో విచారణ ముగిసిన తరువాత 2020 మార్చి పదోతేదీన కోర్టు మిగిలిన ఆరుగురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. వీరిలో అక్కరబోయిన అప్పలరాజు, అమర్‌నాథ్ జైల్లో ఉన్నారు. బెయిల్‌పై విడుదలైన వానపల్లి శివ, కోరాడ హేమంత్‌కుమార్, సాదే వినయకుమార్, షేక్ నాగూర్ మృతిచెందారు. ఎ-1 నిందితుడు తిరుమలరాజు కోర్టుకు హాజరుకాకపోవడంతో 2019 జూలై 24న అతడిపై నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ అయింది. అప్పటి నుంచి నిందితుడు తప్పించుకుని తిరుగుతున్నాడు. ఆరిలోవ సీఐ హెచ్ మల్లేశ్వరరావు, ఎస్ఐలు శంకర్, వరహాలనాయుడు, జి.అప్పారావు బృందాలుగా ఏర్పడి అనకాపల్లి జిల్లా పెదమదీన, రావికమతం, బుచ్చయ్యపేట, ఎస్.రాయవరం మండలాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అతడి స్నేహితుల సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా రాఘవరాజును గుర్తించిన పోలీసులు నక్కపల్లి అడ్డురోడ్డు వద్ద మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. కేసును ఛేదించిన ఆరిలోవ సీఐ బృందాన్ని సీపీ శంఖబ్రత బాగ్చి, ఏసీపీ అభినందించారు. సమావేశంలో సీఐ మల్లేశ్వరరావు, ఎస్ఐ రామదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ అనుమానాస్పద మృతి

గాజువాక, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ తుంగ్లాం వద్ద ఓ లారీ డ్రైవర్ అనుమానాస్పదంగా మృతిచెందాడు. వివరాలిలావున్నాయి...ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన హుస్సేన్ (36) బ్రిక్స్ లోడ్‌తో సోమవారం రాత్రి ఆటోనగర్ చేరుకున్నాడు. రాత్రి లారీలో నిద్రించిన అతడు మంగళవారం ఉదయం మృతిచెందినట్లు క్లీనర్ గుర్తించాడు. గాజువాక పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేయలేదని, మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామన్నారు.

వ్యక్తి నిర్బంధంపై పోలీసులకు ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తనను అకారణంగా నిర్బంధించడమే కాకుండా, పర్సు, ఫోన్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంవీపీ పోలీసులకు ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. హెచ్‌బీ కాలనీ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ సమీపంలోని మెడికల్ ల్యాబ్‌లో గోపి అక్కౌంట్స్ పీఆర్‌ఓగా పనిచేస్తున్నాడు. పరీక్షలకు రోగులు చెల్లించే సొమ్ములో రిఫర్ చేసిన వైద్యులకు కొంత కమిషన్‌ను ఏరోజుకారోజు పంపించడం అతడి బాధ్యత. అయితే నాలుగు నెలలుగా 15 మంది వైద్యులకు కమిషన్లు పంపించలేదనే ఆరోపణపై సోమవారం విధులకు వచ్చిన తనను రాత్రి పది గంటల వరకూ నిర్బంధించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఖాళీ కాగితాలపై సంతకాలు తీసుకున్నారని తెలిపాడు. దీనిపై ప్రాథమిక విచారణ చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఏజెన్సీ నుంచి గంజాయిని కొనుగోలుచేసి రైల్లో తరలించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు మంగళవారం అరెస్టు చేసి, 6.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ ఎస్. శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎక్సైజ్ సీఐలు ఎస్.శ్రీనివాస్, సీహెచ్ రాజేశ్వరి బృందం మంగళవారం పెందుర్తి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేశారు. స్టేషన్‌కు 50 మీటర్ల దూరంలో ప్రకాశం జిల్లాకు చెందిన కువ్వరపు వినీల్‌కుమార్, షేక్ సలీం రెండు బ్యాగులతో కనిపించారు. తనిఖీ చేయగా 6.8 కిలోల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. వారిని అదుపులోకి తీసుకుని పెందుర్తి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

కలెక్టర్‌ను కలిసిన వీఎంఆర్‌డీఏ ఛైర్మన్


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రణవ్ గోపాల్

సిరిపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను మంగళవారం వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషనర్‌గా వ్యవహరిసున్న కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏలో చేపడుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు.